

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 65 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | శనివారం 7 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :65 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : ONGOLE | SAT 7 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

పరిషత్ పోరులో గెలుపెవరిది?

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..

365 కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు!

పెన్ పవర్ డెస్క్: ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేల మంది అభ్యర్థుల భవితవ్యం మరి కొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో.. అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో దాదాపు 30 వేల మందికి పైగా సిబ్బంది ఈ కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. వేల సంఖ్యలో పోలీసు బందోబస్తు కూడా

- మిగతా 2లో





- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటన
- నీట మునిగిన పొలాల్లో నడుస్తూ, పంట నష్టాన్ని స్వయంగా అంచనా
- రాత్రి పగలు సమీక్షలు, టెలికాన్ఫరెన్సులతో యంత్రాంగాన్ని అప్రమత్తం
- తుఫాను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ, సహాయక చర్యల పర్యవేక్షణ

- మిగతా 2లో



సచివాలయంలో సమీక్షలు, టెలికాన్ఫరెన్సులకే పరిమితం కాకుండా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పాలం గట్లపైకి, పంట బోదెల మీదకు వెళ్లి తుపాను సృష్టించిన బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. రైతు కష్టం తెలిసిన నాయకుడిగా, అన్నదాతల కన్నీళ్లు తుడిచేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాలకు నీట మునిగి కళ్లెదుటే పంట నాశనమవుతుంటే గుండెలు బాదుకుంటున్న కర్షకులకు అండగా నిలిచారు. ధ్వంసమైన రహదారుల్లో, బురదమయమైన పాలాల్లో నడుస్తూ, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది: రేటూరులో చంద్రబాబు





జపాన్ లో భారీ భూకంపం..

భయంతో పరుగులు పెట్టిన జనం

పెన్ పవర్ డెస్క్: జపాన్‌లో భారీ భూకంపం సంభవించి చింది. శుక్రవారం (నవంబర్ 6, 2026) రాత్రి తూర్పు తీరానికి సమీపంలోని సముద్ర ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 6.1 తీవ్రతతో భూమి కంపించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7:39 గంటల సమయంలో భూకంపం సంభవించినట్లు జపాన్ వాతావరణ

- మిగతా 2లో



యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడి..

20 మంది మృతి

పెన్ పవర్ డెస్క్: యెమెన్‌లోని ఓ రద్దీ మార్కెట్‌పై జరిగిన వైమానిక దాడిలో మంది మృతి చెందారు. అనేక మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హూతీ తిరుగుబాటు వర్గం పేర్కొంది. ఈ దాడికి సౌదీ అరేబియా కారణమని ఆరోపించింది. హైజ్ ప్రావిన్సులో

- మిగతా 2లో

విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి

బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు

- స్థానిక ఎన్నికల తీరుపై వైసీపీకి మంత్రి ఆనం చురకలు
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహిస్తున్నామన్న ఆనం
- తన సహనాన్ని చేతకానితనంగా చూడొద్దని విక్రమ్ రెడ్డికి హెచ్చరిక



- మిగతా 2లో



ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

- కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్న విజయసాయిరెడ్డి
- ఈ నెల 11న పార్టీ ఆవిర్భావం
- పలువురు నేతలు పార్టీలో చేరిక

- మిగతా 2లో

- రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయంగా వస్తున్నామన్న మాజీ ఎంపీ
- జగన్ పామ్మనకుండా పాగబెట్టి బయటకు పంపించారని తీవ్ర ఆరోపణ

పెన్ పవర్ డెస్క్: రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాను స్థాపిస్తున్న కొత్త పార్టీలో పలువురు నాయకులు చేరుతున్న సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నుంచి తనను జగన్ అవమానించి బయటకు పంపించారని, పొమ్మనకుండా పొగబెట్టారని సంచలన ఆరోపణలు

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!



- సిద్దిపేట ఆర్టీసీ డీఎం వ్యవహారశైలిపై మంత్రి పొన్నం ఆగ్రహం!
- కార్మికులను నేలపై కూర్చోబెట్టిన ఘటనపై విచారణకు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి సూచన
- కార్మికుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్: సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు

- మిగతా 2లో

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

- చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచిన కాంగ్రెస్
- 1, 21, 25, 33వ వార్డులను కైవసం చేసుకున్న హస్తం పార్టీ
- మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్ ప్రభావమే కారణమంటున్న విశ్లేషకులు
- పురపాలికలో ఆధిక్యంలో కొనసాగుతున్న టీడీపీ
- గెలిచిన అభ్యర్థులకు ఏపీ కాంగ్రెస్ కమిటీ శు భాకాంక్షలు

- మిగతా 2లో



ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్!

- అమితాబ్ బచ్చన్ బంగ్లా, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను పేల్చేస్తామని హెచ్చరిక
- బాంబే హైకోర్టుకు నేరుగా వచ్చిన బెదిరింపు ఈ-మెయిల్
- అప్రమత్తమైన పోలీసులు, కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

పెన్ పవర్ డెస్క్: ముంబై మహానగరంలో మరోసారి బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా' సహా నగరంలోని పలు కీలక ప్రాంతాలను పేల్చివేస్తామంటూ ఆగంతుకులు

- మిగతా 2లో



రాజ్యాంగం కంటే రాజకీయ

పార్టీ గొప్ప కాదు

పెన్ పవర్ డెస్క్: రాజ్యాంగం పై భారత్ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం కంటే ఏ ఒక్క రాజకీయ పార్టీ గొప్పది కాదని స్పష్టం చేశారు. సీజేఐని టార్గెట్ చేస్తూ

- మిగతా 2లో



రోకలితో కొట్టి.. భార్య సహా ఏడుగురిని

చంపేసిన క్యాబ్‌డ్రైవర్

పెన్ పవర్ డెస్క్: కర్ణాటక రాజధాని బెంగళూరులో దారుణ ఘటన వెలుగుచూసింది ఓ క్యాబ్ డ్రైవర్.. తన భార్య, ఆమె బంధువులు సహా ఏడుగురిని దారుణంగా హత్య చేశాడు. ఒకరి తర్వాత ఒకరిని అతడు చంపిన తీరు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజాజీ

- మిగతా 2లో



ఆంధ్రప్రదేశ్‌లో జలకళ..

రిజర్వాయర్లలోకి కొత్త నీరు..

- భారీ వర్షాలతో ఏపీ జలాశయాల్లోకి చేరిన కొత్త నీరు
- మొత్తం 505.76 టీఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు
- ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు
- శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు
- రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

- మిగతా 2లో



పెన్ పవర్

శనివారం 7 నవంబర్ 2026



ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

- మొదటి పేజీ తరువాయి

చేశారు.ఈ నెల 11వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భావం ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో చేరికలను స్వాగతించారు. విశ్వ హిందూ పరిషత్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సుమతి రెడ్డి, అనకాపల్లికి చెందిన హిందూ ఎస్సీ, ఎస్టీ కులాల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సుమతి రెడ్డి రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేస్తారని, నియోజకవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ చేరికలు తమ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లో పెట్టకూడదు. రాజ్యాంగబద్ధంగా ఎవరి హక్కులు వారికి దక్కాలి. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్గత ప్రజాస్వామ్యంతో మా పార్టీ నడుస్తుంది" అని ఆయన వివరించారు.

జగన్ నన్ను బయటకు గెంటేశారు

వైసీపీ నుంచి బయటకు రావడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను పార్టీని వదిలి వెళ్ళలేదు, నన్ను బయటకు తోసేశారు. పొమ్మనకుండా పొగబెట్టి, అప్పుడప్పుడు అవమానించి, ఒక మనిషిగా భరించలేనటువంటి పరిస్థితులు కల్పించారు. అందుకే ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు నన్నెప్పుడూ అవమానించలేదు. కానీ జగన్ పాలనలోనే ఇది జరిగింది. చెప్పుడు మాటలు విని నన్ను దూరం పెట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకటి రెండు కాదు, 70కి పైగా అవమానాలను భరించానని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేస్తే ఎవరైనా ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు. "ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుంది. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు ఇక అక్కడ ఉండలేకపోయాను. కూర్చున్న కొమ్మను నరికేసినప్పుడు ఇంకేం చేయగలం? అందుకే బయటకు వచ్చాను" అని అన్నారు.

హిందూత్వ ముద్రపై స్పందన

పార్టీలో కాషాయ రంగు ప్రభావం ఎక్కువ అంటున్నారనే విమర్శపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ, "మనం భారతమాత బిడ్డలం. మన అమ్మ గురించి మనం గొప్పగా చెప్పుకుంటాం. అలాగని ఇతరులను ద్వేషించం. భారతదేశంలోని ప్రతి క్రిస్టియన్, ముస్లిం వెనుక భారతీయ డీఎన్ఏ ఉంది. ఇది నిరూపితమైన సత్యం. మేము హిందూ ధర్మం గురించి మాట్లాడితే ఇతరులకు వ్యతిరేకం కాదు. అందరికీ సమన్యాయం చేయడమే మా పార్టీ ఉద్దేశం," అని స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన విమర్శించారు. తాము పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసుకుంటామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రోకలితో కొట్టి.. భార్య సహా ఏడుగురిని చంపేసిన క్యాబ్‌డ్రైవర్

- మొదటి పేజీ తరువాయి

నగర్‌లో ఈ ఘటన జరిగింది. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కేసు వివరాలు వెల్లడించారు.బెంగళూరు నగరంలో నివసిస్తోన్న నిందితుడు ఇందు శేఖర్.. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి 20 ఏళ్ల క్రితం సునీతతో వివాహం జరిగింది. తమ వివాహ బంధంలో భార్య తరపు బంధువులు జోక్యం చేసుకుంటున్నారని శేఖర్ కొన్నేళ్లుగా అసంతృప్తితో ఉన్నాడు. ఆ వ్యవహారం వారి మధ్య గొడవలకు కారణమైంది. దాంతో భార్య సహా ఆమె బంధువులను రోకలితో కొట్టి చంపాడు. తర్వాత మృతదేహాలను నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడు. అక్టోబర్ 17 నుంచి ఒక్కొక్కరిని ఇంటికి రప్పించి ఈ హత్యలు చేయడం ప్రారంభించాడని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

మృతుల్లో భార్య సునీత, అత్త రూపవతి, బావమరుదులు శివకుమార్, శంకర్, అత్తింటికి చెందిన దివ్య, నళిని, ఏడేళ్ల చిన్నారి ఉన్నారు. ఒక్కొక్కరిని ఒక్కో కారణం చెప్పి.. ఇంటికి పిలిచి చంపేశాడని పోలీసులు వెల్లడించారు. భార్యను హత్య చేసిన తర్వాత.. ఆమె మృతదేహాన్ని మాయం చేశాడు (దీవఅస్త్రుశ్రీబతీబ వీబతీఎవతీ జ్ఞుంవ). ఆమె స్నేహితురాలితో కలిసి ట్రిప్‌నకు వెళ్లిందని ఇరుగురుపొరుగువారు, బంధువులతో నమ్మబలికాడు. ఆమె ఫోన్‌నూ స్విచ్ఛాఫ్ చేశాడు. మద్యం తాగుదామని బావమరుదులను ఇంటికి పిలిచాడు. నళిని కనిపించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణలో భాగంగా శేఖర్‌ను ప్రశ్నించారు. తానే ఈ హత్యలు చేసినట్లు శేఖర్ (దీవఅస్త్రుశ్రీబతీబ జ్ఞుఎ ణతీఅజవతీ) అంగీకరించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ హత్యలు చేయడానికి నిందితుడికి అతడి కుమార్తె కూడా సహకరించిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్!

- మొదటి పేజీ తరువాయి

ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ మెయిల్ నేరుగా బాంబే హైకోర్టుకు రావడంతో భద్రతా ఏజెన్సీలు తక్షణమే అప్రమత్తమయ్యాయి.న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం... బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (దీూజు), వర్లీ రేస్‌కోర్స్, అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చివేస్తామని ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. "ఈ బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముంబై పోలీసులు, ఇతర భద్రతా ఏజెన్సీలు దీనిపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం" అని ముంబై పోలీసులు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ వెల్లడించింది. బెదిరింపు నేపథ్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో ముంబైలో ఇలాంటి బెదిరింపులు ఎక్కువయ్యాయి. అక్టోబర్ 23న అమితాబ్ బచ్చన్ ఆస్తిని లక్ష్యంగా చేసుకుని ఓ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అంతకుముందు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) ప్రధాన కార్యాలయానికి కూడా ఇలాంటి హెచ్చరికే అందింది. అయితే, తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు.తాజా ఘటనతో సైబర్ సెల్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ-మెయిల్ పంపిన వారి ఐపీ అడ్రస్, డిజిటల్ ఆధారాలను ట్రేస్ చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరుస ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

జపాన్ లో భారీ భూకంపం..

- మొదటి పేజీ తరువాయి

సంస్థ వెల్లడించింది. రాజధాని టోక్యోతో పాటు పలు ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. జపాన్ తూర్పు తీరానికి సమీపంలోని పసిఫిక్ సముద్ర ప్రాంతం భూకంప కేంద్రం కేంద్రీకృతమైందని జీహీూఅధికారులు వెల్లడించారు.భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో 6.1 ప్రకంపనల తీవ్రతతో భూకంపం సంభవించింది.

ఎక్కడెక్కడ ప్రకంపనలు వచ్చాయి..

జపాన్ వాతావరణ సంస్థ ప్రకారం మియాగి, ఫుకుషిమా, ఇబరాకి ప్రిఫెక్చర్లలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. రాజధాని టోక్యో మధ్య ప్రాంతంలోనూ భూమి కంపించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రకంపనలతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం.

సునామీ ముప్పు ఉందా? నష్టం ఎంత?

ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న అధికారిక, అంతర్జాతీయ నివేదికల్లో సునామీ హెచ్చరికపై స్పష్టమైన సమాచారం లేదు. అలాగే ప్రాణనష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

బురదలో, పాలం గట్లపై సీఎం చంద్రబాబు.. క్షేత్రస్థాయిలో రైతులకు అండ..

తుపాను హెచ్చరికలు జారీ అయిన అక్టోబరు 27వ తేదీ నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తమయ్యారు. 'అర్నబ్', 'మురసు' తుపానుల సమయంలో రాత్రిళ్లు కూడా మేల్కొని కలెక్టర్లు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్సులు నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని సమన్వయం చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన సహాయం కోసం కృషి చేశారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలతో విపత్తు నిర్వహణలో తనదైన మార్క్ చూపించారు. ఆయన ముందుచూపు, సత్వర స్పందన వల్ల పెను నష్టాన్ని నివారించడంలో యంత్రాంగం సఫలమైంది.

క్షేత్రస్థాయిలో పర్యటనలతో వాస్తవాల పరిశీలన

అధికారులు ఇచ్చే నివేదికలతో సరిపెట్టకుండా, వాస్తవ నష్టాన్ని కళ్లారా చూసేందుకు చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవలి 'అర్నబ్' తుపాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. తాజాగా 'మురసు' తుపాను కారణంగా అతలాకుతలమైన బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరు గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పొలాల్లోకి వెళ్లి, పంట బోదెల వద్ద నిలబడి నష్టాన్ని అంచనా వేశారు. బురదలో, పొలం గట్లపై తిరిగి పంటలు దెబ్బతిన్న వైనాన్ని కళ్లారా చూశారు.పర్యటనలో భాగంగా, రైతుల వద్దకే నేరుగా వెళ్లి వారి ఆవేదనను ఓపికగా విన్నారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయారు, ఎంత పెట్టుబడి పెట్టారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశిస్తున్నారనే వివరాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలైన రైతుల బాధను చూసి చలించిన ఆయన, అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు కుంగిపోకుండా, తిరిగి ధైర్యంగా వ్యవసాయం చేసుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను దెబ్బతీసింది

మంచి దిగుబడితో పంట చేతికొచ్చి ఆనందంగా ఉన్న సమయంలో మురసు తుపాను రైతుల ఆశలను నీరుగార్చిందని సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను తుపాను దెబ్బతీయడం అత్యంత బాధాకరమని, నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలను వారికి వివరించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "అర్నబ్, మురసు తుపానుల వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఎల్ నినో ప్రభావంతో రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంటే, పట్టిసీమ ద్వారా నీరందించి పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాం. మంచి దిగుబడితో పంట చేతికందే సమయంలో మురసు తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలతో నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని సీఎం స్పష్టం చేశారు. "తుపానులపై ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దు. ముందస్తు జాగ్రత్తల వల్లే ప్రాణనష్టాన్ని నివారించి, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం" అని విజ్ఞప్తి చేశారు. తుపాను సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సాయం తీసుకుంటున్నామని వివరించారు. అర్నబ్ తుపాను వల్ల నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుపాను వల్ల దెబ్బతిన్న మరో 10 వేల స్తంభాలను కూడా యుద్ధప్రాతిపదికన సరిచేస్తున్నామని తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.తుపానుల వల్ల జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో అంచనాలు వేస్తున్నామని, దీనిపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఫోన్ చేసి తుపానుల ప్రభావంపై ఆరా తీశారని వెల్లడించారు. నష్టపోయిన రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పెట్టుబడిని తిరిగి అందిస్తామని హామీ ఇచ్చారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే పనిచేస్తారని స్పష్టం చేశారు. నల్లమడ డ్రెయిన్‌కు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేశారు. "గత పాలనలో తుపానులు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి పరామర్శించారు. కానీ మేము ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక అన్ని విషయాలూ మాట్లాడతా" అని అన్నారు. తీర ప్రాంతాలను తుపానులు దెబ్బతీస్తుంటే, రాయలసీమను ఎల్ నినో ఇబ్బంది పెడుతోందని, అందుకే రాష్ట్రంలో నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జలాశయాల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం రిజర్వాయర్లలో మొత్తం 505.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీలలో సుమారు 43.51 శాతానికి సమానం. వర్షాలు కొనసాగితే మరో 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు.నదీ బేసిన్ల వారీగా చూస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో అత్యధికంగా 318.27 టీఎంసీలు (42.47% సామర్థ్యం), పెన్నా బేసిన్‌లో 107.74 టీఎంసీలు (36.47%), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72%) నిల్వ ఉన్నాయి. ఇతర బేసిన్లలోని ప్రాజెక్టులలో కలిపి 58.72 టీఎంసీల నీరు ఉంది.అయితే, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మిశ్రమంగా ఉన్నాయి. శుక్రవారం నాటి లెక్కల ప్రకారం, శ్రీశైలం డ్యామ్‌లో 215.81 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 51.60 టీఎంసీల (23.9%) నీరు మాత్రమే ఉంది. ఇక్కడ నీటిమట్టం 885 అడుగులకు గాను 832 అడుగుల వద్ద ఉంది. నాగార్జున సాగర్‌లో 180.91 టీఎంసీలు (58%), పులిచింతలలో 28.19 టీఎంసీల (61.6%) నీరు నిల్వ ఉంది.మరోవైపు, పెన్నా బేసిన్‌లోని సోమశిల ప్రాజెక్టులో 19.74 టీఎంసీలు (25.3%), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6%) ఉన్నాయి. అదే సమయంలో, గండికోట (69.5%), గోరకల్లు (78.8%), ఏలేరు (91%) వంటి రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, నవంబరు 4 ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5 ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మొత్తం మీద రాష్ట్రంలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు నిండాలంటే భారీ వర్షాలు అవసరమని స్పష్టమవుతోంది.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు..

మంత్రి పొన్నం సీరియస్!

- మొదటి పేజీ తరువాయి

నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

రాజ్యాంగం కంటే రాజకీయ

పార్టీ గొప్ప కాదు

- మొదటి పేజీ తరువాయి

పోస్ట్ చేసిన వ్యవహారంలో స్పందించిన విచారణ చేపట్టిన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం పంచోలి బెంచ్.. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడు సహా పలువురు నేతలకు నవంబర్ 6న నోటీసులు జారీ చేశారు.న్యాయవాది వినీత్ జిందాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు..కేపీసీసీ అధ్యక్షుడు, కార్యదర్శితో సహా కమిటీ అధికారులందరూ తమపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోవద్దో వివరించాలని ఆదేశించింది.ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగమే సర్వోన్నతమైనదని, ఏ వ్యక్తీ, ఏ రాజకీయ పార్టీ దానికంటే పైన నిలవలేరని చేసింది. న్యాయపాలన స్వాతంత్ర్యం రాజకీయ అనుకూలత బట్టి మారే విషయం కాదని కోర్టు స్పష్టం చేసింది.న్యాయ నిర్ణయాలపై విమర్శ చేయవచ్చునని , అయితే న్యాయవ్యవస్థను భయపెట్టేందుకు లేదా న్యాయపాలనకు అడ్డుపడేందుకు భావప్రకటనా స్వేచ్ఛను ఆసరాగా వాడుకోలేరని కోర్టు తెలిపింది.

కేపీసీసీ తరపు న్యాయవాది వాదిస్తూ, ఆ పోస్ట్ ను పార్టీ నేతల అనుమతి లేకుండా ఓ కార్యకర్త చేశారని, విషయం తెలిసిన వెంటనే తొలగించారని చెప్పారు. పార్టీ అప్పటికే షరతులు లేని క్షమాపణ చెప్పిందని, కోర్టుకు కూడా క్షమాపణ దాఖలు చేస్తామని చెప్పారు. దానిపై స్పందించిన జస్టిస్ అరవింద్ కుమార్, క్షమాపణ నిజంగా హృదయపూర్వకంగా వచ్చిందా లేదా కేవలం కాగితానికే పరిమితమైందా అని పరిశీలిస్తామని అన్నారు.కోర్టు ఈ దశలో నేతలను నేరుగా హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. అటార్నీ జనరల్‌ను, సీనియర్ న్యాయవాదులు అరవింద్ దాతర్, సిద్ధార్థ్ అగర్వాల్‌లను అమికస్ క్యూరీగా నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు బెంచ్ తెలిపింది.

యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడి.. 20 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటన జరిగిందని, అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా ధ్రువీకరించింది. హల్ అదారా మార్కెట్‌పై మూడు వైమానిక దాడులు జరిగాయని, అనేక మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని హూతీ సైనిక అధికార ప్రతినిధులు వెల్లడించారు. కామిస్ ముషాయిత్ వైమానిక స్థావరం నుంచి యుద్ధ విమానాలు టేకాఫ్ అయ్యాయని, తైజ్ ప్రావిన్సు మీదుగా వెళ్లాయని అన్నారు. మరోవైపు, తైజ్ ప్రావిన్సు అధికారులు మాత్రం వీటిని తోసిపుచ్చారు. ఇది హూతీల చర్యేనని.. ఇక్కడ ఎలాంటి వైమానిక దాడులు జరగలేదని పేర్కొన్నారు. హూతీ తిరుగుబాటుదారులే క్షిపణులతో విచక్షణారహితంగా దాడులు జరుపుతున్నారని స్థానిక ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది.

విక్రమ్ రెడ్డి వంద మందితో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు యత్నించారు

స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుంటే, వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.నెల్లూరులో ఆయన మాట్లాడుతూ... ఓసీకి కేటాయించిన మేయర్ స్థానాన్ని బీసీలకు కేటాయించడమే టీడీపీ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో నామినేషన్ల సమయంలోనే అభ్యర్థులను బెదిరింపులకు గురి చేశారని... ఇప్పుడు సక్రమంగా ఎన్నికలు జరుగుతుంటే ఆటంకాలు కలిగిస్తున్నారని విమర్శించారు. ఆత్మకూరులో 10 వార్డులు వైసీపీ గెలుచుకున్నా తాము అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. అనంతసాగరం పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి వందమంది అనుచరులతో వచ్చి బూత్ క్యాప్చరింగ్‌కు ప్రయత్నించారని, దొంగ ఓట్లు వేయించారని సంచలన ఆరోపణలు చేశారు. దొంగ ఓట్లు వేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు.ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డిని ఉద్దేశించి ఆనం ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ అనుభవాన్ని తక్కువ అంచనా వేయొద్దని, సుప్రీంకోర్టుకు లాగుతాననే బెదిరింపులకు తాను భయపడనని స్పష్టం చేశారు. ప్రస్తుతం సంయమనంతో వ్యవహరిస్తున్నానని, తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఆయన గట్టిగా హెచ్చరించారు.

పరిషత్ పోరులో గెలుపెవరిది?

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..

- మొదటి పేజీ తరువాయి

ఈ కౌంటింగ్ కేంద్రాల దగ్గర ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమయ్యే కౌంటింగ్.. తొలి ఫలితం వచ్చేసరికి కనీసం నాలుగు గంటలు సమయం పడుతుందని అంచనా. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు తమ తీర్పును పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 70.72 శాతం ఓటింగ్ నమోదు కావడం ఓటర్లలో చైతన్యానికి నిదర్శనంగా ఉంది. వరదలు, తీవ్ర వర్షాల వల్ల పోలింగ్ వాయిదా పడ్డ 5 మండలాల్లో ఇవాళ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇవి కాక మరో మూడు జిల్లాల్లో వివిధ కారణాల వల్ల మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించింది. వాటికి కూడా పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 28 జిల్లాల్లో మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11 వేలకు పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు విధులను నిర్వహించనున్నారు. వీరితోపాటు 28,500 మంది కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు ఉంటారు.

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

4 వార్డుల్లో గెలిచిన కాంగ్రెస్

ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఫలితాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీ కూటమి హవా కొనసాగినప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఏకంగా నాలుగు వార్డులను కైవసం చేసుకుని దశాబ్ద కాలం తర్వాత తన ఉనికిని చాటుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న జరిగింది. అయితే మురసు తుపాను ప్రభావంతో చీరాలలో కౌంటింగ్ నవంబర

గిద్దలూరు జెడ్పీటిసి ఎన్నికల కౌన్టింగ్ కంభం ప్రభుత్వ జూనియర్ కాలేజి

నియోజక వర్గంలో 5 మండలాలు

అర్ధవీడు, బెస్తవారిపేట, కంభం ,

గిద్దలూరు, రాచర్ల మండలాలు

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్06

గిద్దలూరు అసెంబ్లీ నియోజక వర్గ పరిలోని 5 మండలాలూ గిద్దలూరు, కంభం, బి పేట రాచర్ల మండలాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు మొత్తం 120 పోలింగ్ స్టేషన్లు 38 టేబుళ్లు 160 కౌన్టింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలు సూచనల అనుగుణంగా లెక్కింపు



ప్రక్రియ పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్దేశిత విధానాలకు కట్టుబడి ఉండేలా కౌన్టింగ్ నిర్వహించ బడుతోందని అధికారులు తెలిపారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

వైస్ చైర్మన్ పీఠం ఎవరికి..?

- మార్కాపురంలో మొదలైన కొత్త సమరం - 39 వార్డుల్లో కూటమి హవా... ఒక్క వార్డులోనే వైసీపీ

- జనసేన అండ్ టీడీపీ.. మధ్యలో టిడిపి ముస్లిం మహిళలు పేర్లు

- ఎమ్మెల్యే, జనసేన ఇన్‌ఛార్జ్, బీజేపీ అధ్యక్షుల మధ్య తెరవెనుక చర్చలు









మార్కాపురం (జిల్లా స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ నవంబర్06

మార్కాపురం మున్సిపాలిటీ ఎన్నికలు ముగిశాయి. కూటమి చైర్మన్ అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున్ భారీ మెజారిటీతో గెలిచాడు. 40 వార్డులకు గాను 39 వార్డులను కూటమి కైవసం చేసుకుంది. ఒక్క వార్డు మాత్రమే వైసీపీ గెలుచుకుంది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ అసలు కథ ఇప్పుడే మొదలైంది. చైర్మన్ పీఠం తేలిపోయింది. ఇప్పుడు అందరి చూపు వైస్ చైర్మన్ పీఠం మీదే. ఎవరు వైస్ చైర్మన్ అవుతారు,జనసేనకా, టీడీపీకా,లేక టిడిపిలోని ముస్లిం సామాజిక వర్గానికా, మార్కాపురంలో ప్రతి టీ కొట్టులో, ప్రతి కూడలిలో ఇదే హాట్ టాపిక్.

39 - 1... ఇది విజయం కాదు... సునామీ..

మార్కాపురం చరిత్రలో ఇంతటి భారీ విజయం ఎప్పుడూ చూడలేదని సీనియర్లు చెబుతున్నారు. 40 వార్డుల్లో 39 గెలవడం అంటే మామూలు విషయం కాదు. ప్రజలు కూటమికి పూర్తి అధికారం ఇచ్చేశారు. చైర్మన్‌కు నేరుగా ఓటు, కౌన్సిలర్‌కు సపరేటు ఓటు,ఈ రెండిట్లోనూ కూటమి హవా కొనసాగింది. మల్లికార్జున్ భారీ మెజారిటీతో గెలవడంతో ఆయన నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం ఏంటో తేలిపోయింది. వైసీపీకి మిగిలింది ఒక్క వార్డు మాత్రమే. ఇది ఓటమి కాదు,ఘోర పరాజయం అని కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

జనసేన నుంచి మార్కెట్ శీను,బలమైన పోటీదారు..

వైస్ చైర్మన్ రేసులో మొదటి పేరుగా వినిపిస్తున్నది జనసేన నుంచి మార్కెట్ శీను పేరు. మార్కాపురంలో జనసేనకు ఉన్న పట్టు, పవన్ కళ్యాణ్ అభిమానుల బలం, కూటమిలో జనసేనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత,ఇవన్నీ ఆయనకు కలిసి వచ్చే అంశాలు. గత ఎన్నికల్లో జనసేన కార్యకర్తలు చైర్మన్ గెలుపు కోసం కష్టపడ్డారని, అందుకు ప్రతిఫలంగా వైస్ చైర్మన్ పదవి జనసేనకు ఇవ్వాలని ఆ పార్టీ శ్రేణులు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. మార్కెట్ శీను పేరు ఇప్పుడు మార్కాపురం అంతటా మార్మోగుతోంది.

టీడీపీ నుంచి కొండయ్య యాదవ్... సీనియారిటీకి పెద్ద పీట

రెండో పేరు టీడీపీ సీనియర్ నాయకులు నాలి కొండయ్య యాదవ్. దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన వ్యక్తి. కష్టకాలంలో పార్టీని వదలని నమ్మకమైన నాయకుడు. సీనియారిటీ, అనుభవం, బీసీ సామాజిక వర్గం బలం, ఇవన్నీ ఆయనకు ప్లస్ అవుతున్నాయి. సీనియర్లను గౌరవించాలి. కష్టపడిన వారికి పదవి ఇవ్వాలి అని టీడీపీలోని ఒక వర్గం గట్టిగా వాదిస్తోంది. నాలి కొండయ్య యాదవ్ కు వైస్ చైర్మన్ ఇస్తే పార్టీలోని పాత కార్యకర్తలకు మంచి సందేశం వెళ్తుందని ఆ వర్గం భావిస్తోంది.

31వ వార్డు నుంచి ముస్లిం మహిళ... సంచలనం సృష్టించే పేరు

ఈ రేసులో అందరినీ ఆశ్చర్యపరుస్తున్న మూడో పేరు. 31వ వార్డు నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ముస్లిం మహిళ షేక్ నజీర్ ఉన్నిసా. ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం కావడం అంటే ఆ వార్డు ప్రజలందరి ఆమోదం ఆమెకు ఉందని అర్థం. ముస్లిం సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కూటమి పెద్దలు భావిస్తే ఈమె పేరు ముందు వరుసలోకి వస్తుందని సమాచారం. మహిళకు, మైనార్టీకి, ఏకగ్రీవ విజేతకు. మూడు ప్లస్ పాయింట్లు ఒకే వ్యక్తికి ఉండటం అరుదు. అందుకే ఈ పేరు తెరపైకి రాగానే మార్కాపురం రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అవునా, నిజమా అని అందరూ ఆశ్చర్యంతో అడుగుతున్నారు.

9వ బ్లాక్ నుంచి పఠాన్ మూర్తుజాబీ... రేసులో మరో బలమైన పేరు

ఈ రేసులో మరో బలమైన పేరుగా 9వ బ్లాక్ అభ్యర్థి పఠాన్ మూర్తుజాబీ పేరు కూడా వినిపిస్తోంది. ఈమె పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్ సతీమణి. వైస్ చైర్మన్ అభ్యర్థిగా ఈమె కూడా పోటీలో ఉన్నారని సమాచారం. ముస్లిం సామాజిక వర్గం నుంచి మరో బలమైన అభ్యర్థిగా ఈమె పేరు తెరపైకి రావడంతో రేసు మరింత ఆసక్తికరంగా మారింది.

తెరవెనుక చర్చలు... ముగ్గురు పెద్దల మధ్య కీలక భేటీ

ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ అధ్యక్షులు పీవీ కృష్ణారావు మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. కూటమి ధర్మం ప్రకారం మూడు పార్టీలకు సముచిత స్థానం కల్పించాలని వారు భావిస్తున్నారు. చైర్మన్ టీడీపీకి వచ్చింది కాబట్టి వైస్ చైర్మన్ జనసేనకు ఇస్తే బాగుంటుందా,లేక టీడీపీలోనే సీనియర్‌కు ఇచ్చి జనసేనకు వేరే ప్రాధాన్యత ఇస్తారా,లేక అందరికీ ఆమోదయోగ్యంగా ముస్లిం మహిళను తెచ్చి కొత్త చరిత్ర సృష్టిస్తారా, అనేదానిపై తీవ్ర కసరత్తు జరుగుతోంది.

చివరి నిర్ణయం కౌన్సిలర్ల చేతిలోనే..

ఈసారి ఎన్నికల విధానం కూడా ఆసక్తికరంగా ఉంది. చైర్మన్ ప్రమాణ స్వీకారం అనంతరం కౌన్సిల్ ఏర్పడిన తర్వాత కౌన్సిలర్లందరూ కలిసి వైస్ చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది. అంటే 39 మంది కూటమి కౌన్సిలర్ల నిర్ణయమే ఫైనల్. పెద్దలు ఏ పేరు సూచించినా, చివరికి కౌన్సిలర్ల ఆమోదం తప్పనిసరి. అందుకే ఇప్పుడు ప్రతి కౌన్సిలర్ ఇంటికి వైస్ చైర్మన్ ఆశావహులు వెళ్లి మద్దతు కోరుతున్నారని సమాచారం. మార్కాపురం రాజకీయాల్లో మరో వారం రోజులు ఇదే హాట్ టాపిక్‌గా కొనసాగనుంది. చివరకు ఎవరి పేరు బయటకు వస్తుందో చూడాలని మొత్తం పట్టణం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది.

అనుమతి లేకుండా టపాసులు అమ్మితే అంతే సంగతి

- ఎస్పీ పంకజ్ కుమార్ మీనా హెచ్చరిక
- లైసెన్స్ లేకపోతే దుకాణం లేదు, అమ్మకం లేదు
- ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు తప్పనిసరి
- అక్రమ నిల్వపై సమాచారం ఇవ్వండి... పోలీసులకు ఫిర్యాదు చేయండి



మార్కాపురం పెన్ పవర్ నవంబర్ 06

దీపావళి పండుగ వచ్చేస్తోంది. పట్టణమంతా టపాసుల సందడితో కళకళలాడుతోంది. కానీ ఈ సందడి వెనుక ప్రమాదం పొంచి ఉందని మరిచిపోకండి. అందుకే జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా గట్టి హెచ్చరిక చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పండుగ సంతోషంగా జరుపుకోవాలి. ప్రమాదం కొని తెచ్చుకోవద్దని ఎస్పీ తెలిపారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయదారులు ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు మరియు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. అనుమతి పొందిన బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే నిర్ణీత నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. ఇరుకైన సందుల్లో, జనసమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, ఇళ్ల మధ్యలో దుకాణాలు పెడితే ప్రమాదమే. అలాంటి వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సులు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలని ఎస్పీ తేల్చి చెప్పారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఒక్క చిన్న నిప్పురవ్వ చాలు, పెద్ద ప్రమాదం జరగడానికి. అందుకే ముందు జాగ్రత్తే ముద్దు అని చెప్పారు. నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో టపాసులు ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా స్థానిక పోలీస్ స్టేషన్‌లో గాని, ఎస్పీకి గాని సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మీ ఒక్క ఫోన్ కాల్,వందలాది మంది ప్రాణాలను కాపాడుతుంది.

టపాసులు కాల్చేటప్పుడు ఈ జాగ్రత్తలు మర్చిపోవద్దు..

ప్రజలు టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు. పిల్లలను ఒంటరిగా టపాసులు కాల్చనివ్వవద్దు. ఇళ్ల దగ్గర, వాహనాల దగ్గర, పెట్రోల్ బంకుల దగ్గర టపాసులు కాల్చవద్దు. బహిరంగ ప్రదేశంలో, పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని కోరారు. దీపావళి అంటే వెలుగుల పండుగ, విషాదాల పండుగ కాకూడదని ఎస్పీ పేర్కొన్నారు.

లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన దివి శివరాం దంపతులు

-లోకేష్ బాబుకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన దివి దంపతులు





కందుకూరు పెన్ పవర్, నవంబర్ 6: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ బాబును మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, సౌభాగ్య శుక్రవారం ఉండవల్లిలోని నివాసము నందు మర్యాదపూర్వకంగా కలిసి ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపాలిటీ , కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపులో కీలక పాత్ర పోషించిన నారా లోకేష్ బాబుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివరాం సతీమణి దివి సౌభాగ్య త్వరలో జరగనున్న కందుకూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్ పర్సన్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆశపడుతున్నట్లు లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు శివరాం తెలియజేశారు.

ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో కూటమి హవా కొనసాగించేనా?

17 స్థానాల్లో 15 కూటమి ఖాతాలోకి.. సంతమాగులూరు-1, ఏల్చూరు-3పై ఉత్కంఠ

ఎంపీపీ రేసులో కొప్పరం, కొమ్మలపాడు అభ్యర్థులు.. జెడ్పీటీసీకి 5 వేలకుపైగా మెజారిటీ వస్తుందనే అంచనాలు

సంతమాగులూరు, పెన్ పవర్, నవంబర్ 6

సంతమాగులూరు మండలంలో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జెడ్పీటీసీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అధికార కూటమి ఆధిపత్యం కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయనే చర్చ స్థానికంగా జోరందుకుంది. మొత్తం 17 ఎంపీటీసీ స్థానాల్లో సుమారు 15 స్థానాలు కూటమి ఖాతాలోకి వెళ్లే అవకాశాలున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తుండగా, సంతమాగులూరు-1, ఏల్చూరు-3 ఎంపీటీసీ స్థానాల ఫలితాలపైనే ప్రధానంగా ఉత్కంఠ నెలకొంది.

ఎంపీపీ రేసులో కొప్పరం, కొమ్మలపాడు

మండల రాజకీయాల్లో ఎంపీపీ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం కూడా ఆసక్తికరంగా మారింది. ఎంపీపీ పదవికి కీలకంగా భావిస్తున్న కొప్పరం, కొమ్మలపాడు ఎంపీటీసీ స్థానాలు బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఈ రెండు స్థానాలపై రాజకీయంగా ప్రత్యేక దృష్టి నెలకొంది. కొప్పరం నుంచి కూటమి అభ్యర్థి సన్నెబోయిన గురుబ్రహ్మం, కొమ్మలపాడు నుంచి కూటమి అభ్యర్థి మోతాదు భాషా పోటీ చేశారు. ఈ రెండు స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలున్నాయని స్థానిక రాజకీయ వర్గాల్లో అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు స్థానాల ఫలితాలు ఎంపీపీ ఎన్నికల సమీకరణాల్లో కీలకంగా మారనున్నాయి.

సంతమాగులూరు, ఏల్చూరుపైనే అందరి దృష్టి

మండల కేంద్రమైన సంతమాగులూరులో రెండు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా, ప్రధాన రాజకీయ పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పంచాయతీ ఎన్నికలను తలపించే విధంగా కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ సాగింది. సంతమాగులూరు-1 ఎంపీటీసీ స్థానంలో 2,380 మంది ఓటర్లకు గాను 1,493 మంది ఓటు



హక్కు వినియోగించుకోగా 62.73 శాతం పోలింగ్ నమోదైంది. సంతమాగులూరు-2 స్థానంలో 2,391 మంది ఓటర్లకు గాను 1,757 మంది ఓట్లు వేయడంతో 73.48 శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు స్థానాల్లో ఒక స్థానం ఫలితంపై ప్రధానంగా ఉత్కంఠ నెలకొంది. ఇక ఏల్చూరులో మూడు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా, మూడో స్థానం ఎస్సీ రిజర్వేషన్ కావడంతో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఏల్చూరు-1లో 2,855 మంది ఓటర్లకు గాను 1,593 ఓట్లు పోలై 55.80 శాతం నమోదైంది. ఏల్చూరు-2లో 2,855 మంది ఓటర్లకు గాను 1,910 ఓట్లు పోలై 66.90 శాతం నమోదైంది. ఏల్చూరు-3లో 2,286 మంది ఓటర్లకు గాను 1,477 ఓట్లు పోలై 64.61 శాతం నమోదైంది. ఈ మూడు స్థానాల్లో ఏల్చూరు-3 ఫలితంపైనే ప్రధానంగా ఆసక్తి నెలకొంది.

మండలవ్యాప్తంగా 70.67 శాతం పోలింగ్

మండలంలోని 17 ఎంపీటీసీ స్థానాల్లో కలిపి 51,613 మంది ఓటర్లకు గాను 36,479 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 70.67 శాతం పోలింగ్ నమోదైంది. వెల్లలచెరువులో అత్యధికంగా 79.50 శాతం, కొప్పరంలో 78.27 శాతం, కామేపల్లిలో 77.49 శాతం పోలింగ్ నమోదైంది. ఏల్చూరు-1లో అత్యల్పంగా 55.80 శాతం పోలింగ్ నమోదైంది.

జెడ్పీటీసీకి ఐదువేలకుపైగా మెజారిటీ అంచనా!

మండలంలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ కూటమికి అనుకూలమైన ఫలితం వస్తుందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కూటమి జెడ్పిటిసి అభ్యర్థిగా వెల్లలచెరువు గ్రామానికి చెందిన ఆలూరి శ్రీవల్లి పోటీలో ఉండగా వైఎస్సార్సీపీ తరఫున సంతమాగులూరు గ్రామానికి చెందిన గడ్డం సుజాత పూర్ లో ఉన్నారు అయితే కూటమి జెడ్పీటీసీ అభ్యర్థి అభ్యర్థి ఆలూరి శ్రీవల్లి సుమారు 5 వేలకుపైగా ఓట్ల మెజారిటీ వచ్చే అవకాశం ఉందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. అయితే ఈ అంచనాలకు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపుతోనే స్పష్టత రానుంది. మొత్తంగా చూస్తే 17 ఎంపీటీసీ స్థానాల్లో 15 స్థానాలు కూటమికి దక్కే అవకాశాలున్నాయనే అంచనాలు, ఎంపీపీ రేసులో ఉన్న కొప్పరం, కొమ్మలపాడు స్థానాల్లో కూటమి అభ్యర్థులకు కనిపిస్తున్న ఆధిక్యంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు సంతమాగులూరు-1, ఏల్చూరు-3 స్థానాల్లో ఓటర్ల తీర్పు ఎటువైపు ఉంటుందన్నది ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల ప్రచారంలో కనిపించిన రాజకీయ బలాబలాలు ఓట్ల రూపంలో ఎంతవరకు ప్రతిబింబించాయో, కూటమి అంచనాలు నిజమవుతాయో లేదో తేలాలంటే బ్యాలెట్ బాక్సులు తెరుచుకునే వరకు వేచి చూడాల్సిందే. అయితే ఉత్కంఠ భరితంగా సాగిన సంతమాగులూరు ఒకటి ఏల్చూరు మూడవ ఎంపీటీసీ స్థానం కూడా కూటమి కాదు చేరినట్లయితే మండలం మొత్తం కూటమి క్లీన్ షిప్ చేసినట్లేనని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు.

ఇడమ కళ్ళు మాజీ సర్పంచ్ బొంత శేషారెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

గుండెపోటుతో మృతి చెందిన శేషారెడ్డి -మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు.

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 6

కొమరోలు మండలం ఇడమకల్లు మాజీ సర్పంచ్ బొంత శేషారెడ్డి (59) గురువారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. బొంత శేషారెడ్డి ఇడమకల్లు గ్రామపంచాయతీకి గతంలో సర్పంచిగా పనిచేశారు. గురువారం రాత్రి శేషారెడ్డికి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు గిద్దలూరు ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేస్తుండగా శేషారెడ్డి తుది శ్వాస విడిచారు. దీనితో ఆయన కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నేతలు శుక్రవారం ఇడమకల్లు గ్రామంలోని శేషా రెడ్డి ఇంటికి వెళ్లి శేషారెడ్డి మృత దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఎడమ కళ్ళు గ్రామపంచాయతీ అభివృద్ధికి శేషారెడ్డి ఎంతగానో కృషి చేశారని, ఆయన



సేవలను ప్రజలు మర్చిపోలేరని అంటూ, తెలుగుదేశం పార్టీ చురుకైన నేతను కోల్పోయిందని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో అంబవరం శ్రీనివాసరెడ్డి తో పాటు ఎడమ కళ్ళు గ్రామానికి



చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు, కొమరోలు మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొని శేషారెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

దివి పిచ్చయ్య చౌదరి కి ఘన నివాళి

- కందుకూరులో 40 వ వర్ధంతి కార్యక్రమం





కందుకూరు పెన్ పవర్, నవంబర్ 6:

కందుకూరు మాజీ సర్పంచ్ దివి పిచ్చయ్య చౌదరి 40 వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, దివి అభిమానుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని అన్న క్యాంటీన్లో ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. దివి పిచ్చయ్య చౌదరి కందుకూరు అభివృద్ధికి ఎంతో కృషి చేసిన వ్యక్తిగా మాజీ సర్పంచ్ గా ప్రజల మన్ననలు పొందారని దివి అభిమానులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , శ్రేయోభిలాషులు , కందుకూరు పట్టణ ప్రజలు పాల్గొని దివి పిచ్చయ్య చౌదరికి నివాళులర్పించి అన్నసంతర్పణలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దివి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.

రీ పోలింగ్‌పై ఎస్పీ ప్రత్యేక నిఘా.. భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి



పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 6

పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామంలో నిర్వహించిన రీ పోలింగ్ సందర్భంగా మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలు, పరిసర ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తును క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు, ఎన్నికల అధికారులకు సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రం వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ పంకజ్ కుమార్ మీనా సంతృప్తి వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏపీలోకి బీహార్ సాంస్కృతి తెచ్చిన కూటమి సర్కార్

వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్

మార్కాపురం పెన్ పవర్ నవంబర్ 06

దేశంలో మంచికి పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి బీహార్ సంస్కృతి తీసుకువచ్చి కూటమి సర్కార్ అరాచకం సృష్టిస్తుందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నకల్లో ను కూటమి ప్రభుత్వం పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆయన విమర్శించారు. ఇంత దారుణంగా ఎన్నికలు ఎందుకు జరపాలని, మీరే స్వయంగా విజేతగా ప్రకటించుకుని ఉంటే ప్రజాధనం కూడా మిగిలేదని ఆయన సూచించారు. తమ గుండాయిజం ఎలా ఉంటుందో ప్రజలకు చూపేందుకే కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించినట్టు స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి నియంత అయినా ప్రజాక్షేత్రంలో కుప్పకూలక తప్పదని, కూటమి సర్కార్కు కూడా త్వరలోనే కుప్ప కులకతప్పదని ఆయన హెచ్చరించారు. మరోసారి టిడిపి వస్తే ఇక రాష్ట్రంలో ఎన్నికలే జరగవు అన్న నిర్ణయానికి ప్రజలు వచ్చేసారని, మరోసారి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో టిడిపి కూటమి పార్టీలకు గెలిపించరని ఆయన జోస్యం చెప్పారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని, కూటమి అరాచకాలను న్యాయస్థానం అనే బోనులో నిలబెట్టి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ విస్తరణకు అధికారులు, హోల్ సెల్ డీలర్స్‌కు శిక్షణ



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 06

గిద్దలూరు వ్యవసాయాధికారి కార్యాలయం లో సహాయ వ్యవసాయ సంచాలకులు గిద్దలూరు ఆధ్వర్యంలో “ఎరువుల విక్రయ నియంత్రణ వ్యవస్థ” (ఎఫ్ ఎఫ్ ఎస్) మీద సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, హోల్ సేల్ డీలర్స్,రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కే. రాజశ్రీ మాట్లాడుతూ ఎరువుల విక్రయాల వ్యవస్థ భారతదేశంలో చట్టబద్ధమైన నిబంధనలు, డిజిటల్ పారదర్శకత పంపిణీ నియంత్రణలపై ఆధారపడి ఉంటుందని, రైతులకు ప్రామాణికమైన ఎరువులను సరసమైన ధరకు అందించడం, సబ్సిడీ దుర్వినియోగాన్ని అరికట్టడం , బ్లాక్ మార్కెటింగ్‌ను నియంత్రించడం ఈ ఫ్రేమ్‌వర్క్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించుటకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడుతున్నారు తద్వారా ఆహార పదార్థాలు రోజురోజుకు కలుషితమవుతూ ఉన్నామని. కావున రసాయన ఎరువులు అవసరమైన మోతాదుమేర మాత్రమే వాడాలని, శాస్త్రవేత్తల సిపారసు మేరకు పంట రకాన్ని బట్టి ఎంత అవసరమవుతాయో అంతవరకు మాత్రమే ఇవ్వాలని ఈ విధానాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులు ఎక్కడా కూడా ఎరువులకు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని రైతుల కు అవసరమైన మేర ఎరువులు సకాలంలో అందుతాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి, గిద్దలూరు విజయ భాస్కర్ రెడ్డి ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా రైతులు ఏ విధంగా ఎరువులు నమోదు చేసుకోవాలి, ఎరువుల విక్రయ కేంద్రంలో ఎలా సంప్రదించాలని డిజిటల్ రూపంలో తెలియజేయడం జరిగింది. సాంకేతిక వ్యవసాయ అధికారి జడ్. మెర్సీ భూసార పరీక్షల ప్రాముఖ్యత, విధి విధానాలు, తీసుకునే పద్ధతులు, ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు షేక్ మహబూబ్ బాషా, అబ్దుల్ రఫీక్, మనోహర్, దేవేంద్ర గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్స్ , రైతులు పాల్గొన్నారు.

జడ్పిటిసి సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్తుముల హరితమ్మను సన్మానించిన టిడిపి నేతలు.

కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, ఆయన సతీమణి ముత్తుముల హరితమ్మను సన్మానించిన నేతలు.



కొమరోలు పెన్ పవర్ నవంబర్ 6

కొమరోలు మండల జడ్పిటిసి సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్తుముల హరితమ్మను, ఆమె భర్త కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డిని శుక్రవారం పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కొమరోలు లోని ముత్తుముల సంజీవరెడ్డి నివాసగృహానికి తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నేతలు కొమరోలు జడ్పిటిసి సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముత్తుముల హరితమ్మకు శుభాకాంక్షలు తెలియజేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి ఆయన సతీమణి ముత్తుముల హరితమ్మను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమను ఘనంగా సన్మానించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు సంజీవరెడ్డి దంపతులు ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు డాక్టర్ సొంఠం వెంకట్రామిరెడ్డి, అమ్మ అంబవరపు సుబ్రహ్మణ్యం, గజ్జలకొండ సత్యం, చింతలపల్లి తెలుగుదేశం పార్టీ నేతలు సారే ఎల్లాలు నాయుడు, ఊసా రాముడు, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, కరీముల్లా,ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి 15 ఏళ్ల విద్యార్థి మృతి

స్నేహితులతో ఆటకు వెళ్లి తిరిగిరాని బాలుడు.. చెన్నుపల్లిలో విషాదఛాయలు

తల్లిదండ్రులు, బంధువుల రోదనతో కన్నీటిపర్యంతమైన గ్రామం

సంతమాగులూరు (బల్లికురవ), పెన్ పవర్, నవంబర్ 6

స్నేహితులతో కలిసి సరదాగా ఆడుకోవడానికి వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ధూపాటి సురేంద్ర (15), శుక్రవారం స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడిపోయి మృత్యువాత పడ్డాడు. చిన్న వయసులోనే బాలుడు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

ఆటకు వెళ్లి అనంతలోకాలకు..

తోటి స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన సురేంద్ర తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు అతడి మరణవార్త తీరని శోకాన్ని మిగిల్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బంధువులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో చెన్నుపల్లి గ్రామం శోకసంద్రంగా మారింది. ఈ హృదయవిదారక దృశ్యాలు అక్కడికి చేరుకున్న వారిని సైతం కంటతడి పెట్టించాయి.



పోలీసుల కేసు నమోదు..: కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు బల్లికురవ ఎస్సై నాగరాజు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు.

విద్యాశాఖ అధికారుల నివాళులు..

మృతి చెందిన విద్యార్థి సురేంద్ర మృతదేహానికి మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, రమేష్ ఘనంగా నివాళులర్పించారు. బాలుడి అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

భద్రతపై ఆలోచించాల్సిన ఘటన..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన నీటి కుంటలు, చెరువులు, ఇతర నీటి నిల్వ ప్రాంతాల వద్ద తగిన రక్షణ ఏర్పాట్లు లేకపోవడం చిన్నారుల భద్రతకు ప్రమాదకరంగా మారుతోంది. ఆటల కోసం బయటకు వెళ్లే పిల్లలు ఇలాంటి నీటి వనరుల సమీపంలోకి వెళ్లినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ఘటన నేపథ్యంలో గ్రామ శివారులోని నీటి కుంటల వద్ద రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాదకర ప్రాంతాలపై చిన్నారులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక కుటుంబానికి తీరని విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటన గ్రామస్తులను కలచివేసింది.

గంగవరంలో ప్రశాంతంగా ముగిసిన రీ పోలింగ్



పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 6

గంగవరం గ్రామంలో నిర్వహించిన రీ పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ పోలింగ్‌లో మొత్తం 61.88 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ తెలిపారు.రీ పోలింగ్ నిర్వహించిన పోలింగ్ కేంద్రం నంబర్--5లో మొత్తం 879 ఓట్లు ఉండగా, వాటిలో 544 ఓట్లు పోలైనట్లు ఆయన వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రత నడుమ మార్కాపురానికి తరలించినట్లు తెలిపారు.శనివారం మార్కాపురంలో ఓట్ల లెక్కింపు నిర్వహించి ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాలు

మార్కాపురం పెన్ పవర్ నవంబర్ 06

నేడు జరగనున్న ఎంపిటిసి జడ్పిటిసి ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ పటిష్ట ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మార్కాపురం మార్కెట్ యార్డ్, కంభం జూనియర్ కళాశాల, కనిగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మూడు కేంద్రాల వద్ద కూడా భద్రతలో ఎలాంటి లోపం ఉండకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద ప్రత్యేకంగా తనిఖీలు చేయాలని, లోపల, బయట పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. బారికేడ్లతో జనసమూహాలను నియంత్రించాలని ఆదేశించారు.ఎన్నికల అధికారుల అనుమతి, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించాలని ఎస్పీ చెప్పారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు తప్ప ఇతరులు ఎవరూ కేంద్రాల వద్ద గుమిగూడవద్దని సూచించారు. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలంలోనే నిలపాలని చెప్పారు.స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పోలీస్ పహారా ఉంటుందని ఎస్పీ తెలిపారు. సీసీటీవీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా కూడా పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా



ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి, మొబైల్ పెట్రోలింగ్ కొనసాగిస్తామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు టీంలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సిగరెట్లు, అగ్గిపెట్టెలు, గుర్తులు కలిగిన వస్తువులు తీసుకురావద్దని ఎస్పీ హెచ్చరించారు. బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 163, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని చెప్పారు. గెలిచిన అభ్యర్థులు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు చేయవద్దని, బాణసంచా కాల్చవద్దని ఎస్పీ సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల అధికారులతో సమన్వయంతో పని చేయాలని ఎస్పీ ఆదేశించారు. భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుమిగూడవద్దని, పోలీసులకు సహకరించాలని ప్రజలకు జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, విజయోత్సవాల విషయంలో నిబంధనలు పాటించాలని కోరింది.

నేడే చూడండి.... నన్నయలో ఎవరి జాతకం ఎలా ఉంది.





ఎన్నికల ఫలితాలపై అభ్యర్థుల్లో మొదలైన కౌంట్ డౌన్.

గోకవరం పెన్ పవర్ నవంబర్ 06:-- స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై క్షణక్షణం ఉత్కంఠగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు ఎవరి ఫలితాలు ఎలా ఉంటాయో అని కొంతమంది ఊపిరి బిగబట్టి ఉన్న మా అభ్యర్థి నెగ్గుతాడు మా అభ్యర్థి నెగ్గుతాడు అంటూ అభిమానులు గ్రామాల్లో సంబరాలకు ఏర్పాటు చేసుకుంటున్నారు ఎవరి భవిష్యత్తు ఎలా ఉందో తెలియదు కానీ ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో పదిలంగా భద్రపరిచి ఉన్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కౌన్ డౌన్ ప్రారంభంతో ప్రధాన అభ్యర్థులలో మాత్రం ప్రెస్టేజ్ గా ఈ ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు ఎప్పుడు గడప దాటని మహిళామూర్తులు కూడా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేసరికి సర్వశక్తులుఒడ్డి బరిలోకి దిగి గెలుపు గుర్రాలుగా నిలవాలని ఇంటింటికి ఓట్లు అభ్యర్థిస్తూ పరుగులుగా తీసారు. ఇది అంతా ఒక వంతు అయితే ఫలితాల కోసం ఊహించని రీతిలో టెన్షన్లతో తలలు పట్టుకుంటూ ఇళ్లకే పరిమితం అయిపోయి ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. గోకవరం మండల పరిషత్ సంబంధించి 20 ఎంపీటీసీ స్థానాలకు గాను 40 మంది అభ్యర్థులు బరిలో తలపడుతున్నారు ఇందులో ఒక అభ్యర్థి స్వతంత్ర అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించు కోనున్నారు తన అదృష్టాన్ని పరీక్షించుకోవడమే కాదు తన తలబడుతున్న ఎన్నికల ప్రత్యర్థులకు చమటలు పట్టించారు. కొత్తపల్లిలో ఒక ఎంపీటీసీ స్థానం ఏకగ్రీవం కాగా మరో స్థానానికి నువ్వా నేనా అనే విధంగా మండలంలో ఊహించని విధంగా గట్టి పోటీని ఎదుర్కొన్నారు అక్కడ వారి భవిష్యత్తు ఎలా ఉంటాది అనేది ఈరోజు మధ్యాహ్నం కి తేలే అవకాశం ఉంది, కొత్తపల్లి గ్రామపంచాయతీని ఏక చక్రాధిపత్యంగా 20 సంవత్సరాల నుంచి ఏలుతున్న మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు జనపరెడ్డి సుబ్బారావు అలియాస్ బాబు తన భార్యను ఈసారి ఎంపీపీ బరిలో దింపారు దీనికి చెక్కు పెట్టడానికి ఓఎన్జిసి రిటైర్ ఉద్యోగి తెలుగుదేశం పార్టీలోకి రాజకీయ రంగ ప్రవేశం చేసి సొంత పార్టీ పైనే తిరుగుబాటు చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన దిండి వెంకటేశ్వరరావు చాలా గట్టిగానే ఎదుర్కొన్నారు అయితే ఇక్కడ విజయం ఎవరిని వరిస్తాదా అంటూ మండలమంతా ఆసక్తిగా ఎదురుచూస్తుంది.2021 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి ప్రతిపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుండి జడ్పిటిసి అభ్యర్థిగా పోటీచేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గోకవరం కి చెందిన దాసరి శ్రీరంగ రమేష్ చేతిలో ఓటమిచెందిన కృష్ణనిపాలెం గ్రామానికి చెందిన ప్రశాంత్ కుమార్ హలోనేన్ (కన్నబాబు) తాజాగా జడ్పిటిసి స్థానానికి తన కుటుంబం ఉండే పోటీ చేయించి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.వైస్సార్సీపీ నుండి జడ్పిటిసి అభ్యర్థి గా ఎదురుపాక తాజా మాజీ సర్పంచ్ దాసరి సింగారమ్మ కోడలు దాసరి వెంకట లక్ష్మి మొదటి సారిగా మండల స్థాయి ఎన్నికల బరిలోకి దిగారు. వీరి ఇరువురిలో జడ్పిటిసిగా ఎవరిదిపై చెయ్యి అవుతుందో వేచి చూడాలి.

రసాయనాలు వద్దు..... మన ఆకులే చాలు....!

ఎమ్ ఎల్ టి లగుడు దేవి



గోకవరం పెన్ పవర్ నవంబర్ 06:-రైతులు వేల రూపాయలు పెట్టి రసాయన మందులు కొనాల్సిన అవసరం లేదని, పొలంలోనే దొరికే ఆకులతో పంటకు మేలు చేసే కషాయాన్ని తయారు చేసుకోవచ్చని గోకవరం మండల ప్రకృతి వ్యవసాయం ఎం ఎల్ టి లగుడు దేవి అన్నారు.గురువారం రంప ఎర్రం పాలెం గ్రామ శివారు పెంటపల్లి లో గండి శ్రీను పొలంలో చెట్ల ఆకులు కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎం ఎల్ టి లగుడు దేవి దేవి స్వయంగా ముందుండి రైతులతో కలిసి అజ్ఞాస్తం కషాయం తయారు చేసి చూపించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "మన తాతలు, అమ్మమ్మల కాలంలో ఇలాంటి కషాయాలతోనే పంటలను కాపాడుకునేవారని మధ్యలో మనం మర్చిపోయి షాపుల్లో దొరికే రసాయన మందులకు అలవాటు పడటం దానివల్ల భూమి పాడవుతుంది,పంట ఆరోగ్యం దెబ్బతింటుంది, రైతుకు ఖర్చు పెరుగుతుంది" అని అన్నారు.పొలంలో దొరికే వివిధ రకాల ఆకులు, ఉల్లిపాయలు, పసుపు వంటి సహజ పదార్థాలను పెద్ద గిన్నెలో వేసి కట్టెల పొయ్యి మీద ఉడకబెట్టి తయారు చేసిన అజ్ఞాస్తం కషాయాన్ని పంటకు పిచికారీ చేస్తే పురుగు, తెగుళ్లు దరిదాపుల్లోకి రావని ఆమె వివరించారు.ఇది వేస్తే పురుగు రాదు. ఖర్చు తగ్గుతుంది. పంట ఏపుగా పెరుగుతుంది.భూమి సారవంతంగా బాగుంటుంది. రైతుకు ఇంతకంటే ఏం కావాలి?అని దేవి అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వయంగా అజ్ఞాస్తం కషాయం తయారీని నేర్చుకున్నారు. దేవి మేడం గారు చెప్పిన పద్ధతిని తమ పొలాల్లో కూడా పాటిస్తామని వారు తెలిపారు.అందరూ కలిసి చేస్తే ఏ పనైనా సాధ్యమవుతుందని, రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఈ సందర్భంగా గోకవరం ఎమ్ ఎల్ టి లగుడు దేవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గండి శ్రీను అనే రైతు ఐ సి ఆర్ పి లు మాధవి దొరబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

మురసు తుఫాను ప్రభావిత అరటి, బొప్పాయి తోటల్లో ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తల పర్యటన: రైతులకు కీలక సూచనలు



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 06:డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా కట్టుపల్లి ధనుంజయరావు ఆదేశాల మేరకు,మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం, ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం కృష్ణాపురం, ఎం. నాగులపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించింది. తుఫాను వల్ల నేలకొరిగిన, దెబ్బతిన్న అరటి, బొప్పాయి తోటలను పరిశీలించి రైతులకు పలు యాజమాన్య పద్ధతులను సూచించారు.తుఫాను ధాటికి నిలిచి ఉన్న అరటి మొక్కలు త్వరగా కోలుకోవడానికి ఒక్కొక్క మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ నేల ద్వారా అందించాలని, అలాగే సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు సోకిన ఆకులను తొలగించి లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలని, అవసరమైతే 15 రోజుల తర్వాత మరోసారి కొట్టాలని స్పష్టం చేశారు. అధిక వర్షాల కారణంగా బొప్పాయి మొక్కలు పసుపు రంగుకు మారి కాండం కుళ్ళే లక్షణాలు కనిపిస్తే నివారణగా లీటరు నీటికి 2 గ్రాముల రెడోమిల్ కలిపి మొక్క మొదళ్ల వద్ద డ్రెంచింగ్ చేయాలని సూచించారు. బొప్పాయిలో సూక్ష్మపోషకాల లోపాలను నివారించడానికి లీటరు నీటికి జింక్ సల్ఫేట్ 2.5 గ్రా., బోరాన్ 1 గ్రా. మరియు యూరియా 10 గ్రా. చొప్పున కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని రైతులకు శాస్త్రవేత్తల బృందం సలహాలు ఇచ్చింది. ఈ క్రమంలో రైతులు అడిగిన పలు విషయాలు కు శాస్త్ర సంబంధమైన సూచనలను క్షేత్ర స్థాయిలో అందించారు.ఈ పర్యటనలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ సి.హెచ్. రూత్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఇ. రేఖ, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎ. దేవిహ్ వరప్రసాద్ రెడ్డి, స్థానిక ఉద్యాన అధికారి అమర్నాథ్, గ్రామీణ సహాయకులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

నేడు ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

12 జడ్పీటీసీ స్థానాలకు 45 మంది, 101 ఎంపీటీసీ స్థానాలకు 275 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది

4 కౌంటింగ్ కేంద్రాలు.. 202 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్, నవంబర్ 7:పోలవరం జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లా ఎన్నికల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఎన్నికల ఫలితాలతో జిల్లాలోని 12 జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసిన 45 మంది అభ్యర్థులు, 101 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసిన 275 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యం తేలనుంది.జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మొత్తం నాలుగు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఓట్ల లెక్కింపు కోసం 202 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ చొప్పున మొత్తం 202 మంది సూపర్‌వైజర్లను నియమించారు. వీరితో పాటు అవసరమైన కౌంటింగ్ సిబ్బందిని కూడా విధుల్లో నియమించారు.కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. బ్యాలెట్ పత్రాల పరిశీలన నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించేలా ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు.మరోవైపు ఎన్నికల ఫలితాలపై జిల్లాలో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తమ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారంటూ వివిధ పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. కొన్నిచోట్ల తమ నాయకుల విజయంపై నమ్మకంతో అనుచరులు పందేలు సైతం కాస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఎన్నికల ప్రచారంలో హోరాహోరీగా తలపడిన వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనుండటంతో అభ్యర్థులు, వారి అనుచరుల్లో ఉత్కంఠ నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు, స్థానిక నాయకుల పలుకుబడి, ఓటర్ల మద్దతు ఎవరికి అనుకూలించాయో ఓట్ల లెక్కింపు అనంతరం స్పష్టంకానుంది. జిల్లాలో ఏ పార్టీ ఆధిపత్యం ప్రదర్శించనుంది, ఏ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయనున్నారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముర‌ుసు తుపాను బీభత్సంతో బాధిత ప్రజలకు భరోసా ఇచిన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 06: ముర‌ుసు తుపాను ప్రభావంతో తాడేపల్లిగూడెం రూరల్ మండలంలోని మారంపల్లి, నందమూరు, అరుళ్ల తదితర గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా వరద నీరు జనావాసాల్లోకి, ఇళ్లలోకి చేరడంతో పాటు రహదారులపై నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ అర్ధరాత్రి సమయంలోనే స్పందించి, తెల్లవారుజామున 3:30 గంటలకే తుపాను ప్రభావిత గ్రామాలకు స్వయంగా చేరుకున్నారు. వర్షం, వరద నీటిని సైతం లెక్కచేయకుండా బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి వారి పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం:

చిన్నపిల్లలు, వృద్ధులు మరియు కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో బాధిత కుటుంబాలకు పాల ప్యాకెట్లు, అల్పాహారం ఏర్పాటు చేసి అందించారు.

వరద నీరు ఇళ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించారు.

నీటిముంపు కారణంగా ఇళ్లలో ఉండలేని కుటుంబాలకు సురక్షితమైన ఆశ్రయ సదుపాయాలను ఏర్పాటు చేశారు.

వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో పరిస్థితులను స్వయంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ముఖ్యంగా రహదారులపై, ఇళ్లలోకి చేరిన వరద నీటిని తొలగించడం, ప్రజలకు అవసరమైన నిత్యావసర సదుపాయాలు అందించడం, మరింత నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సహాయక కార్యక్రమాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు.

క్లాప్ వాహనాలు నిర్వహణ పట్టించుకోని అధికారులు



రాజమహేంద్రవరం, పెన్ పవర్ , నవంబర్ 6:నగరంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించే క్లాప్ వాహనాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ విమర్శించారు.శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయం లో జరిగిన సమావేశం లో అరుణ్ మాట్లాడుతూ నగరంలో 72 వాహనాలు ఉండగా, కాంట్రాక్టర్ మరమ్మతులు చేయించక 12 వాహనాలు నిలిచిపోయాయని, మిగిలిన 60 వాహనాలకు గత పది రోజులుగా గ్యాస్ నింపకపోవడంతో అవి కూడా రోడ్లపైకి రావడం లేదన్నారు. గత వారం రోజులుగా ఇంటింటికీ చెత్త సేకరణ నిలిచిపోయి నగరంలో చెత్త పేరుకు పోయిందన్నారు.క్లాప్ వాహనాల కాంట్రాక్టర్‌కు నగరపాలక సంస్థ నుంచి సుమారు రూ.4.5 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని చెబుతు న్నారన్నారు. కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు కూడా పేరుకుపోయాయన్నారు. నగరపాలక సంస్థ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడ్డారు.సుమారు రూ.700 కోట్ల బడ్జెట్, ఆస్తిపన్ను ద్వారా రూ.90 కోట్ల ఆదాయం ఉన్న కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం డిమాండ్ చేస్తోందని తెలిపారు. బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎస్ మూర్తి, కరి రామకృష్ణ, బి పూర్ణిమ రాజ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8న రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం

మూర్ఛ వ్యాధిగ్రస్తులకు నాలుగు నెలలకు సరిపడా ఉచిత మందుల పంపిణీ

గంగవరం/ రంపచోడవరం పెన్ పవర్ నవంబర్ 6: రామకృష్ణ మిషన్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ ఆదివారం రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ అనారోగ్య సమస్యలతో పాటు ఆయాసం, గుండె దడ, రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ, ఎం.డి., డి.ఎం. (న్యూరో) ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య సేవలు అందించడంతో పాటు నాలుగు నెలలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు.

మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు



జీలుగుమిల్లి, పెన్ పవర్ ,నవంబర్ 6; మండలంలోని జడ్పిటిసి ,9 ఎంపీటీసీ స్థానాలకు గాను శుక్రవారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం ఓట్లు 25 7 13 గాను పురుషులు 7065, స్త్రీలు7977 ,ఇతరులు1 మొత్తం15043 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 58. 5 శాతం పోలింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. దర్భ గూడెం పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్ శ్రావణ్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం వి రమణ ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి..

- విజయం సాధించాలి.
- బిజెపి పట్టణ సమావేశం లో నేతల పిలుపు.



తాడేపల్లిగూడెం,పెన్ పవర్. నవంబర్06:రానున్న పురపాలక ఎన్నికల్లో పార్టీ తరపున సీట్లు ఎవరికీ కేటాయించినా వారి విజయానికి సమిష్టిగా కృషిచేయాలని బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ నెలవారి సమావేశం పార్టీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షత వహించారు.రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, దేశ అభ్యున్నతే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా ప్రజల మద్దతును సాధించి విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న తాడేపల్లిగూడెం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి తరపున భారతీయ జనతా పార్టీకి సీట్లు ఎవరికి కేటాయించిన అందరూ కలిసికట్టుగా పనిచేసి ఘన విజయం సాధించే దిశగా కృషి చేయాలని హేతువు పలికారు. ఏ సమస్యలున్న చర్చించుకుని పరిష్కరించుకోవచ్చునన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధి అజెండాగా భారతీయ జనతా పార్టీ అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తుందన్నారు. త్వరలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమిలో భాగంగా బిజెపి కి ఎన్ని సీట్లు కేటాయించినా విజయమే లక్ష్యం గా అందరూ సమైక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి విజయమే ధ్యేయమన్నారు. బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించి మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు కేటాయించేలా నాయకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీను మాట్లాడుతూ త్వరలో జరగనున్న గూడం మున్సిపల్ ఎన్నికల్లో కూటమిలో భాగంగా బిజెపి అభ్యర్థుల విజయశీ లక్ష్యంగా అందరూ పని చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ, నాయకులు కోట రాంబాబు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పత్స గోపాలకృష్ణ, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు,కార్యదర్శి లచ్చిరెడ్డి సత్యనారాయణ, తుమరాడ చిన్నా,ఓ బిసి మోర్చా రాష్ట్రం కార్యవర్గ సభ్యుల మారిశెట్టి నరసింహ మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, పట్టణ యువమోర్చా అధ్యక్షులు కంచర్ల రాజా, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు తాడాల సూర్యకుమారి,పట్టణ అధ్యక్షురాలు గోకామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మీ దుర్గ, తుట్టగుంట కృష్ణకుమారి, రాష్ట్రం కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, కిసాన్ మోర్చా నాయకులు చెరుకూరి గంగాధర రావు,ఇమ్మంది బెనర్జీ, మాదాసు చంద్రమోహన్, యర్నాల సూరిబాబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాలను తగ్గిద్దాం - అర్బన్ హెల్త్ డాక్టర్లతో కమిషనర్ సమీక్షా సమావేశం.



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 06.తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ చాంబర్ నందు ఈరోజు అర్బన్ హెల్త్ డాక్టర్లతో ఈ-వేస్ట్ పై సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ ఉ మున్సిపల్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎమ్. యేసుబాబు అధ్యక్షత వహించారు.

సమావేశంలో చర్చించిన అంశాలు:

ఈ సందర్భంగా "ఈ - వ్యర్థాలను తగ్గిద్దాం" కార్యక్రమంపై చర్చించారు. పాడైపోయిన, వాడకుండా పడి ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులైన మొబైల్ ఫోన్లు, ల్యాప్ టాప్ లు, చార్జర్లు, బ్యాటరీలు, టీవీలు, ఫ్రిజ్ లు వంటి ఈ-వేస్ట్ ను ఇంట్లోనే ఉంచకుండా, సరైన పద్ధతిలో సేకరించి రీసైక్లింగ్ కు పంపించాలని కమిషనర్ గారు సూచించారు.

ఈ-వేస్ట్ పల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి కలిగే నష్టాలపై అర్బన్ హెల్త్ డాక్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, వార్డుల్లో ప్రత్యేక సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచేందుకు అందరూ భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు, టౌన్ ప్లానింగ్ అధికారి వి జగదీశ్వర్ రావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ హరీష్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రజిని, అర్బన్ హెల్త్ డాక్టర్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత

క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 6:నగరపాలక ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోందని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఎస్ కే వి టి కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎన్నికల సామాగ్రి భద్రపరిచే విధానం, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని, భద్రతా పరమైన అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈలు మదర్సా అలీ, మాధవి, మేనేజర్ అబ్దుల్ మలిక్, అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితుల కష్టాలు తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్

- బాధితులకు పాలు, అల్పాహారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు..
- వరద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్.



తాడేపల్లిగూడెం. పెన్ పవర్. నవంబర్ 06.పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలో మురాసు తుఫాను ప్రభావంతో ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తూ పరిసర గ్రామాలను ముంచెత్తుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ పొంగి పొర్లడంతో నందమూరు, మారంపల్లి గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. పలు ఇళ్లలోకి వరదనీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనజీవనం అస్తవ్యస్తంగా మారడంతో పాటు ముంపు ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు నందమూరు, మారంపల్లి గ్రామాల్లో పర్యటించారు. వరద ముంపునకు గురైన ప్రాంతాలను ట్రాక్టర్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. వరదనీరు ఇళ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్న బాధిత గ్రామస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరదల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులు, నష్టపోతున్న పరిస్థితులను బాధితులు ఆయనకు వివరించారు. గ్రామాల్లో పరిస్థితులను పరిశీలించిన వడ్డి రఘురామ్ నాయుడు వరద బాధితులకు అండగా నిలిచేందుకు తమ వంతు సహాయ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. బాధిత గ్రామస్తులకు పాలు, అల్పాహారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ మురాసు తుఫాను ప్రభావంతో ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తూ రాత్రికి రాత్రి నందమూరు, మారంపల్లి గ్రామాలను వరద ముంపునకు గురిచేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే ముంపు ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిపారు. వరద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముంపు ప్రాంతాల్లో వెంటనే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. వరద బాధితులకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఇతర నిత్యావసర వస్తువులను అందించాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్లలోకి వరదనీరు చేరిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సేవలు అందించాలని కోరారు. వరదల అనంతరం వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి ప్రజలకు అవసరమైన మందులు, వైద్య చికిత్స అందించాలన్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం బయట నుంచి వరద పరిస్థితులను పరిశీలించడం మాత్రమే కాకుండా.. ముంపు ప్రాంతాల్లోకి వెళ్లి బాధితుల మధ్య నిలబడితే వారి కష్టాలు, బాధలు ఏమిటో అర్థమవుతాయని వడ్డి రఘురామ్ నాయుడు వ్యాఖ్యానించారు. వరదల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న ప్రజల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, వారికి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. వరదల కారణంగా ఇళ్లు, గృహోపకరణాలు, ఇతర ఆస్తులు నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, బాధితులు తిరిగి సాధారణ జీవనం సాగించేలా ప్రభుత్వం అండగా నిలవాలని పేర్కొన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం భరోసా కల్పించి, తక్షణ సహాయక చర్యలను వేగవంతం చేయాలని వడ్డి రఘురామ్ నాయుడు కోరారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మురాసు తుఫాను ప్రభావంతో వరద ముంపునకు గురైన నందమూరు, మారంపల్లి గ్రామాల్లో బాధితులకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు.

లూథరన్ హైస్కూల్‌లో రూ.20 లక్షలతో భోజనశాల నిర్మాణం



దాతకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి అభినందనలు

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 6:నగరంలోని జాంపేట లూథరన్ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సీఎస్ఆర్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భోజనశాల శాశ్వత భవన నిర్మాణ పనులను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థుల భోజన వసతి కోసం చేపట్టిన నిర్మాణంలో భాగంగా స్లాబ్ పనులను ముందుకొచ్చిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, తన విజ్ఞప్తికి స్పందించిన శ్రీను భవన నిర్మాణానికి సహకరించేందుకు రూ.20 లక్షలతో కాంక్రీట్ నిర్మాణంగా చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీను, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వచ్చే కార్పొరేషన్ ఎన్నికలకు కూటమి పార్టీలదే గెలుపు



ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం పెన్ పవర్ ,నవంబర్ 6:వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి పార్టీలే గెలుస్తాయని ఆదిరెడ్డి శ్రీనివాసు ధీమా వ్యక్తం చేశారు. అభిప్రాయ బేధాలు ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయానికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక రెడ్డి కన్వెన్షన్ హాల్లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆదిరెడ్డి మాట్లాడుతూ, నగరంలో గత రెండున్నర కూటమిపాలనపై, తన పనితీరుపై సర్వే చేయించానని తెలిపారు ఈ సర్వేలో కూటమిపాలనపై 50 శాతం పైగా, తన పనితీరుపై 57 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. క్వారీ ఏరియాలో సారా బాబుల నుంచి కొంత అసంతృప్తి ఉందన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వార్డుల రిజర్వేషన్లలో తన ప్రమేయం తో తారుమారు అయ్యాయని, దాంతో కూటమి పార్టీల నాయకులు ఆసంతృప్తిగా ఉన్నారనే ఆరోపణలను ఆయన ఖండించారు. ప్రతిపక్ష వైసిపి కి కార్పొరేషన్ లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరని ఎద్దేవా చేస్తూ ఓటర్ల సంఖ్య పై ఆందోళన ఎందుకన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా వందల కోట్ల రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ప్రజలు తమ వైపే ఉన్నారన్నారు. కార్పొరేషన్ లో డిప్యూటీ మేయారు జనసేన కోరడంపై ఆయన స్పందిస్తూ అంతా అధిష్టానాలు చూసుకుంటాయన్నారు.

ఈవీఎంలు అయినా, బ్యాలెట్టైనా కుటమిదే విజయం అన్నారు.

ఎన్నికలు బహిష్కరించిన నిర్వాసితులు



జీలుగుమిల్లి, పెన్ పవర్ ,నవంబర్ 6; కొరుటూరు ఎన్నికల కేంద్రంలో నిర్వాసితులు శుక్రవారం ఎన్నికలు బహిష్కరించారు. కోరుటూరు పంచాయతీ పరిధిలో కొరుటూరు, టేకూరు, గాజులగుంది, చీడూరు, సిరివాక నిర్వాసిత గిరిజనులు సుమారు 773 మంది తమ ఓటు హక్కును తిరస్కరించారు .మాకు ప్రత్యేక పంచాయతీ కావాలని వారు బహిష్కరించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి ఎవరు హాజరు కాలేదు. పి అంకంపాలెం పంచాయతీలు నుండి మాకు ప్రత్యేక పంచాయతీ కావాలని డిమాండ్ చేస్తున్నారు .అయితే ఆ గ్రామానికి అసిస్టెంట్ కలెక్టర్ శ్రవణ్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి రమణ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడిన గాని ఫలితం లేదు. మా నిర్వాసిత గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ కావాలని డిమాండ్ చేశారు.

మురుగు కాలువలో నీరు నిలిచిపోవడంతో ముంపు బారిన 1000 ఎకరాల పంట పొలాలు



తక్షణమే సమస్య పరిష్కరించాలని రైతుల విజ్ఞప్తి

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 6:డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం నుంచి అమలాపురం వెళ్లే ప్రధాన పంట కాలువ పక్కనే ఉన్న ప్రధాన మురుగు కాలువ ప్రస్తుతం రైతులకు తీవ్ర సమస్యగా మారింది. సుమారు 1000 ఎకరాల వ్యవసాయ భూముల నుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లేందుకు ఈ కాలువ ఎంతో కీలకంగా ఉపయోగపడుతోంది. అయితే ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు దుర్గ గుడి సమీపంలోని అండర్‌గ్రౌండ్ మురుగు కాలువలో నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.కాలువలో నీరు ముందుకు వెళ్లకపోవడంతో వర్షపు నీరు పంట పొలాల్లోకి చేరి పెద్దఎత్తున నీరు నిలిచిపోయింది. దీంతో వరి పంటలు నీట మునిగి దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలకు మురుగునీటి పారుదల సమస్య మరింత భారంగా మారింది.

వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే నీట మునుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అండర్‌గ్రౌండ్ కాలువలో నీరు నిలిచిపోవడానికి గల కారణాలను గుర్తించి, వెంటనే పూడిక తొలగించి నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంబంధిత ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగు కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే సుమారు వెయ్యి ఎకరాల పంట పొలాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ర్యాలి గ్రామ రైతులు అధికారులను వేడుకుంటున్నారు. అన్నదాతల కష్టాలను గుర్తించి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

టీడీపీలో సివంగులు.. వదల్లేదుగా.. !



తాజా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ మహిళా నేతలు తమ సత్తా చాటారు. కడపలో ఎమ్మెల్యే ఆర్. మాధవి అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు చురుగ్గా వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. మంత్రి సవిత అనంతపురం జిల్లాలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేశారు. చంద్రగిరిలో పులవర్తి సుధ పోలింగ్ సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అనుసరిస్తూ వ్యవహరించిన తీరు కూడా చర్చనీయాంశమైంది.

కూటమి పార్టీల్లో కీలకమైన టీడీపీలో మహిళా నేతల దూకుడు మరోసారి చర్చకు వచ్చింది. 2024 ఎన్నికల సమయంలో విజయం దక్కించుకున్న మహిళా నాయకులు.. పార్టీని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు పురుష నేతల కంటే కూడా ఎక్కువగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నించారు. అదేసమయంలో ఏ ఎన్నికలు వచ్చినా.. మేమున్నామని నిరూపిస్తున్నారు. తాజాగా జరిగిన మునిసిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పురుష నేతల ప్రభావం ఒకవైపు ఉన్నా.. మరోవైపు టీడీపీ మహిళా నాయకులు కూడా దూకుడు ప్రదర్శించారు.ఆర్.మాధవి: కడప కార్పొరేషన్ సహా.. తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కడప ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డప్పగారి మాధవి రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడ పార్టీతో పాటు తన హవాను కూడా పెంచుకునేందు కు ఆమె చేసిన ప్రయత్నం ఫలించింది. నియోజకవర్గంపై పట్టును కొనసాగించే క్రమంలో వైసీపీ నేతలకు కౌంటర్‌గా బలమైన అభ్యర్థుల ఎంపిక నుంచి ఆమె ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఫైర్ బ్రాండ్ నాయకురాలు కావడంతో నియోజకవర్గంలో ఆమె మాటే చెల్లుబాటు అయింది. ఇక, ఎన్నికల వేళలో ప్రత్యర్థులను కట్టడి చేసే విషయంలోనూ మాధవి దూకుడుగానే వ్యవహరించారు.సవిత: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సంజీవరెడ్డిగారి సవిత.. ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. కానీ.. ఆమె ఆది నుంచి కూడా.. జిల్లాపై బలమైన ముద్ర వేసే ప్రయత్నం చేశారు. తాజా ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకునే విషయంలో సవిత తనదైన దూకుడు ప్రదర్శించారు. ఫైర్‌బ్రాండ్ నాయకురాలు కాకపోయినా.. వివాదాలకు దూరంగా ఉన్నా.. ప్రజలను ఆకర్షించే విషయంలోను.. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని వివరించి ప్రజల ఓటు బ్యాంకును సానుకూలంగా మార్చుకునే విషయంలోనూ మంత్రి సవిత తనదైన ముద్ర వేసుకుని చాలా మునిసిపాలిటీల్లో క్లీన్‌స్వీప్ చేశారు.పులవర్తి సుధ: పార్టీ పరంగా టీడీపీలో కీలక పోస్టు లేకపోయినా.. చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నానీ సతీమణిగా .. జిల్లాలో పేరు తెచ్చుకున్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని మంగళం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తనదైన చాతుర్యంతో కట్టడి చేశారు. రిగ్గింగులు, ఘర్షణలు జరగకుండా.. ఆయనను అనుసరిస్తూ.. జనరల్ ఏజెంట్‌గా వ్యవహరించిన సుధా రెడ్డి, ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో "చెవిరెడ్డి ఎక్కడికి వెళ్తే అక్కడికి తన వాహనంలో వెంబడిస్తానని, ఆయన వెంటే ఉంటానని" హెచ్చరించి రాజకీయంగా సంచలనం సృష్టించారు. ఇలా.. అనేక మంది మహిళా నాయకులు టీడీపీలో విశేషంగా కృషి చేయడం గమనార్హం.

జనం పట్టుబడితే అంతే.. ఏపీలో పోలింగ్ బహిష్కరణ!



ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు పలు గ్రామాల ప్రజలు దూరంగా నిలిచారు. రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదాలపై నిరసనగా సామూహికంగా ఎన్నికలను బహిష్కరించారు. విశాఖ, చిత్తూరు, అనంతపురం, అల్లూరి, తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఈ నిరసనలు కనిపించాయి. కొన్ని చోట్ల గ్రామంలోని ఓటర్లంతా ఓటింగ్‌కు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

అధికార కూటమి, సహా ఇతర పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్రంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యల కారణంగా బహిష్కరిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తమ ప్రాంతాల్లో కనీస సౌకర్యాల లేమి, పోలింగ్ కేంద్రాల మార్పు, రిజర్వేషన్ల వివాదం, తారు రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఓటర్లు పోలింగ్ ప్రక్రియకు దూరంగా నిలిచారు.

ఎక్కడెక్కడ?

1) విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాయనిపేట గ్రామంలోని చెరువు కాలుష్య సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏళ్ల తరబడి శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఇక్కడి ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మొత్తం 120 ఓట్లకు గాను ఓటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరించారు.

2) చిత్తూరు జిల్లాలోని ఐరాల మండలం అబ్బుగుండు గ్రామానికి కనీస రహదారి సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రం వంటి కనీస వసతులు కల్పించలేదని నిరసిస్తూ ఇక్కడి ప్రజలు ఓటింగ్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారు. వాటిపై హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3) అనంతపురం జిల్లాలోని నెరమెట్ల గ్రామంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ గ్రామానికి చెందిన ప్రజలు కూడా ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌ను బహిష్కరిస్తూ సామూహిక నిర్ణయం తీసుకున్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, ఉపాధి కల్పన వంటివాటిని పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

4) అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, గన్నేరు పుట్టు పంచాయితీ, గొప్పు గరువు, పొర్లు గ్రామాల గిరిజనులు సరైన రోడ్డు సౌకర్యం లేదని, జబ్బులు జ్వరాలు వస్తే ప్రాణాలు పోతున్నాయని, వైద్యం, విద్యా, రవాణా లేకా అవస్తలు పడుతున్న ప్రభుత్వం,అధికారులు ,ప్రజా ప్రతినిధులు పట్టించు కోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తమ ప్రాంతానికి తారు రోడ్డు మంజూరు అయ్యేంత వరకు ఎన్నిక ల్లో పాల్గొన బోమని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు బహిష్కరిస్తునట్లు ప్రకటించారు.

5) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మామిడిగుంట ఎస్సీ కాలనీ ఓటర్లు ఎప్పటి నుంచో సమీపంలోనే ఉన్న పిల్లమేడు కేంద్రంలో ఓటు వేస్తున్నారు. అయితే.. ఈసారి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న దయనేడు కేంద్రానికి మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు.. అంత దూరం వెళ్లలేమంటూ.. పోలింగ్‌ను బహిష్కరించారు.

6) తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని వినాయకపురం గ్రామం: దాదాపు 40 ఏళ్లుగా కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాన్ని అకస్మాత్తుగా మార్చడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు స్వచ్ఛందంగా పోలింగ్ ప్రక్రియకు దూరంగా ఉండిపోయారు.

7) అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మండలంలోని రొంగలివానిపాలెం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్‌ను తొలుత బీసీకి కేటాయించి, ఆ తర్వాత మార్పులు చేయడంపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలోని సుమారు 800 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా బహిష్కరించారు.

'గ్రేటర్' విశాఖలో జనసేన సునామీ... !



గ్రేటర్ విశాఖలో జనసేన తన బలాన్ని గణనీయంగా పెంచుకుంది. 2021 స్థానిక ఎన్నికల్లో 58 వార్డులకు పోటీ చేసి కేవలం 3 స్థానాలే గెలిచిన పార్టీ.. తాజా మున్సిపల్ ఎన్నికల్లో 32 వార్డుల్లో పోటీ చేసి 25 చోట్ల విజయం సాధించింది. దక్షిణ విశాఖ, అనకాపల్లి, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల్లో మంచి ఫలితాలు సాధించింది. ఈ విజయంతో ఉత్తరాంధ్రలో పార్టీ విస్తరణకు మరింత ఊతం లభించనుందని జనసేన నేతలు భావిస్తున్నారు.

గ్రేటర్ విశాఖపట్నంలో జనసేన సునామీ సృష్టించింది. నిజానికి ఉత్తరాంధ్రపై కూటమి పట్టుబిగించింది. దీనిలో నూ జనసేన గత 2019 ఎన్నికలతో పోల్చుకుంటే.. ఇప్పుడు మరింతగా విశాఖపై పట్టు పెంచుకోవడం గమనార్హం. అప్పట్లో పవన్ గాజువాక నుంచి ఓడిపోయిన దరిమిలా.. పార్టీ పుంజుకునే విషయంపై చర్చసాగింది. పైగా అదే ఎన్నికల్లో జనసేన విశాఖ నుంచి పోటీ చేసి కూడా.. పరాజయం పాలైంది. దీంతో గ్రేటర్ విశాఖలో గ్లాసు పరిస్థితి సమస్యగా మారింది. కానీ.. అక్కడే ఇప్పుడు పార్టీ పుంజుకోవడం గమనార్హం.

వాస్తవానికి జనసేన 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ పెద్దగా పోటీ ఇవ్వలేక పోయింది. అప్పట్లో పవన్ కల్యాణ్ పోటీ చేసేవారు చేసుకోండి అనిపిలుపునిచ్చి వదిలేశారు. దీంత 58 వార్డుల్లో జనసేన నాయకులు పోటీ చేయగా.. కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులు మాత్రమే గెలిచారు. కానీ.. దీనికి భిన్నంగా 2024 ఎన్నికల నుంచి కూడా జనసేన విశాఖలో పుంజుకోవడం ప్రారంభించింది. ఒక ఎమ్మెల్యే స్థానంతో పాటు తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల్లోనూ జనసేన దూకుడు చూపింది.ప్రస్తుతం మిత్రపక్షాల తరపున 32 వార్డుల్లో పోటీ చేసింది. అయితే.. కొన్ని కొన్ని మినహా అన్ని చోట్లా జనసేన విజయం దక్కించుకుంది. ఇది ఆ పార్టీకి మంచి ఊపును తెచ్చే వ్యవహారంగానే నాయకులు చెబుతున్నారు. అంతేకాదు.. భవిష్యత్తులోనూ ఉత్తరాంధ్రకు కీలకమైన గ్రేటర్ విశాఖలో పార్టీ పుంజుకునేందుకు.. మరింతగా పార్టీ విస్తరించేందుకు కూడా ఇది దోహద పడుతుందని అంటున్నారు. పైగా ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖలో పార్టీ పుంజుకోవడం ద్వారా.. అధికారంలోకి రావడం కూడా సునాయాసం అవుతుందని లెక్కలు వేస్తున్నారు.

ఎక్కడెక్కడ గెలిచారంటే..

1) విశాఖ దక్షిణంలో 8 వార్డుల్లో పోటీ చేసి 1 వార్డు మినహా మిగిలిన 7 గెలుచుకున్నారు.

2) గాజువాకలో 6 వార్డుల్లో పోటీ చేయగా, 4 చోట్ల విజయం సాధించింది.

3) అనకాపల్లి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేయగా, మూడింటిలో గెలిచింది.

4) భీమిలి పరిధిలో 3 వార్డుల్లో పోటీ చేసి రెండింటిలో గెలిచారు.

5) పెందుర్తి పరిధిలో రెండు చోట్ల పోటీ చేసిన రెండూ సొంతం చేసుకున్నారు.

6) విశాఖ తూర్పులో 4 చోట్ల పోటీ చేసి రెండు గెలిచారు.

7) పశ్చిమ నియోజకవర్గం పరిధిలో మూడు వార్డుల్లో పోటీ చేసి 3 కైవసం చేసుకున్నారు.

8) ఉత్తర నియోజకవర్గంలో 3 వార్డులు కేటాయించగా ఒకటి మినహా మిగిలిన 2 చోట్ల గెలిచారు.

'రాధా-రంగా' మిత్రమండలికి జోష్.. !



విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు 2,65,968 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. మొత్తం 86 డివిజన్లలో కూటమి 76 స్థానాలు గెలుచుకుంది. రాధా పుట్టినరోజునే ఫలితం రావడంతో రాధా-రంగా మిత్రమండలి అభిమానుల్లో సంబరాలు నెలకొన్నాయి.
విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణ (వంగవీటి రాధా) రికార్డు స్థాయి మెజారిటీతో మేయర్‌గా ఘనవిజయం సాధించడంతో రాధా-రంగా మిత్రమండలి లో పండగ వాతావరణం నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత వంగవీటి కుటుంబానికి లభించిన ఈ భారీ విజయం రంగా రాజకీయ వారసత్వాన్ని విజయవాడలో తిరిగి బలంగా నిలబెట్టిందని అభిమానులు మురిసిపోత్న?నారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన వంగవీటి రాధాకృష్ణ.. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థిని రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. రాధాకృష్ణకు మొత్తం 2,65,968 ఓట్లు రాగా, రాయన భాగ్యలక్ష్మికి 1,35,056 ఓట్లు వచ్చాయి. ఇక, నవంబర్ 4న ఓట్ల లెక్కింపు పూర్తి కావడం, అదే రోజు వంగవీటి రాధాకృష్ణ పుట్టినరోజు కావడంతో అభిమానుల ఆనందం రెట్టింపయింది. కేవలం మేయర్ స్థానమే కాకుండా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. గత అక్టోబర్‌లో వంగవీటి రాధాకృష్ణతో పాటు రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అధికారికంగా జనసేన పార్టీ లో చేరారు.ఇప్పుడు సాధించిన ఈ ఘనవిజయంతో రాధా-రంగా మిత్రమండలి బెజవాడ రాజకీయాల్లో తమ పట్టును చాటుకుంది. పాతికేళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణ ప్రస్తుతం 47 ఏళ్ల వయసులో విజయవాడ మేయర్‌గా ఎన్నికయ్యారు. మరీ ముఖ్యంగా వంగవీటి మోహనరంగా 1985లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలవగా.. రంగా హత్యానంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో ఆయన భార్య రత్నకుమారి అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

తండ్రి కార్పొరేటర్‌గా..

వంగవీటి మోహనరంగా 1985లో ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు అయితే అంతకుముందు 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన కృష్ణలంక 40వ డివిజన్లో కార్పొరేటర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. ఇప్పుడు ఆయన కుమారుడు రాధా విజయవాడ నగరానికి మేయరుగా ఎన్నికకావడం గమనార్హం. ఇక, ఈ పరిణామంతో ఈ కుటుంబానికి అత్యంత కీలకమైన రాధా-రంగా మిత్రమండలి పుంజుకుంటుందని అనడంలో సందేహం. ఈ మిత్ర మండలి.. సేవా కార్యక్రమాలతోపాటు.. రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు ఉంది.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

విజయవాడ, నవంబర్ 6, :

ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజుజ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, చైర్‌పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...

నెల్లూరు, నవంబర్ 6, :

రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అండుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పెన్ పవర్

శనివారం 7 నవంబర్ 2026

సెహ్వాగ్ తనయుడి విధ్వంసం.. అండర్-19 ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

ఆర్యవీర్ సెహ్వాగ్ 70 పరుగులతో అజేయ ఇన్నింగ్స్

కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీకి అర్ధశతకం

ఇషాన్ సూద్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు

ఆదివారం పాకిస్థాన్‌తో భారత్ తదుపరి మ్యాచ్



అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70 నాటౌట్), కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ (53 నాటౌట్) అర్ధశతకాలతో జట్టును గెలిపించారు. తొలుత బౌలర్లు నేపాల్‌ను 128 పరుగులకే కట్టడి చేయగా.. భారత ఓపెనర్లు లక్ష్యం చిన్నదిగా మార్చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు ఇషాన్ సూద్ అదిరిపోయే ఆరంభం అందించాడు. కొత్త బంతితో స్వింగ్ రాబడుతూ నేపాల్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. 10 ఓవర్లలో నాలుగు మెయిడిన్లతో కేవలం 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. దీంతో నేపాల్ టాపార్డర్ కుప్పకూలింది. దర్శ్ సోనార్ (43) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఆశిష్ లుహార్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాక నేపాల్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అర్జున్ రాజ్‌పుత్ 3, యశ్వీర్ గౌడ్ 2 వికెట్లు తీయడంతో నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది.స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆర్యవీర్, లక్ష్య రాయ్‌చందానీ అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి కొన్ని ఓవర్లు ఆచితూచి ఆడిన ఈ జోడీ.. ఆ తర్వాత బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా నేపాల్ స్పిన్నర్లపై ఆర్యవీర్ ఎదురుదాడికి దిగాడు. క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లు ఆడుతూ కేవలం 34 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మరోవైపు లక్ష్య రాయ్‌చందానీ స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అతడు 59 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరకు భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.ఈ గెలుపుతో 'గ్రూప్-ఏ'లో భారత్ రెండు పాయింట్లతో అగ్రస్థానానికి చేరింది. నెట్ రన్‌రేట్ 4.170గా నమోదైంది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!

ఈ ఘనత సాధించడం కష్టమేనన్న అభిషేక్ నాయర్

ప్రపంచకప్ తర్వాత ఆడినా అతడి ఆటతీరు ఎలా ఉంటుందో అని సందేహం

వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు

హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలన్న నాయర్

బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం అని వ్యాఖ్య



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు.భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు.వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు.ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు.మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు.వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

బెబో స్ఫూర్తితో సైజ్ జీరోకి మారిన 'అర్జున్ రెడ్డి' బ్యూటీ



అందమైన ఆకుపచ్చ పట్టు చీరలో మెరిసిపోతున్న రాశి సింగ్



'అర్జున్ రెడ్డి'తో గుర్తింపు తెచ్చుకున్న శాలిని పాండే తన సరికొత్త స్లిమ్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన డిజైనర్ ఫోటోషూట్ చిత్రాలు వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె గ్లామర్‌ను ప్రశంసిస్తున్నారు. 'మహానటి', '118', 'నిశ్శబ్దం', 'జయేశ్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించిన శాలిని ప్రస్తుతం విభిన్న పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన -అర్జున్ రెడ్డి- చిత్రంలో బొద్దుగా, అమాయకమైన చూపులతో లవ్లీ -ప్రీతి శెట్టి-గా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన శాలిని పాండే ఇప్పుడు గ్లామర్ రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. నాడు బాలీవుడ్ బెబో కరీనా కపూర్ ఖాన్ చూపించిన సైజ్ జీరో స్ఫూర్తితో తీవ్రంగా శ్రమించిన ఈ బ్యూటీ, బాగా స్లిమ్ అయి సరికొత్త జీరో సైజ్ అవతారంలోకి మారిపోయింది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ లో షేర్ చేసిన డిజైనర్ డ్రెస్ ఫోటోషూట్‌లో శాలిని అందం కవ్విస్తూ.. ట్రెండీ గ్లామర్‌తో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది.ఈ సరికొత్త ఫోటోషూట్ కోసం స్టైలిస్టులు గౌర్వి దేశాయ్, నూపుర్ అభయ్ పధ్యే, హెయిర్ స్టైలిస్ట్ ప్రతీక్ష ముచండికర్, మేకప్ ఆర్టిస్ట్ సిమువా, ఫోటోగ్రాఫర్ ప్రిషా చందేల బృందం కలిసి పనిచేసింది. ఈ ఫోటోలకు శాలిని సింపుల్‌గా వర్ణనగా సింబాలిక్‌గా ఎమోజీలను క్యాప్షన్‌గా జోడించింది. కొద్ది గంటల్లోనే వైరల్‌గా మారిన ఈ పోస్ట్ కామెంట్ సెక్షన్‌లో అభిమానులు ఫైర్, హార్ట్ ఎమోజీలతో ప్రశంసల వర్షం కురిపించారు.--అందానికి ఒక పేరు ఉంటే అది కచ్చితంగా నీదే-- అంటూ నెటిజన్లు శాలిని స్టైలింగ్‌ను కొనియాడుతున్నారు.అందమైన ప్రశంసలతో పాటు.. శాలిని నటించిన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కొన్ని కామెడీ డైలాగ్‌లు కూడా కామెంట్స్‌లో రీసౌండ్ చేస్తున్నాయి. ప్రత్యేకించి --దేభ్‌ో పాపా మైనే క్యా ఉగాయా హై.. గంజా పాపా గంజా-- అనే పాపులర్ డైలాగ్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆ సీన్‌తోనే తాము శాలినికి వీరాభిమానులుగా మారామని పలువురు నెటిజనులు కామెంట్లు చేశారు. మొత్తానికి.. ఈ పోస్ట్ శాలిని పాండే ఫ్యాషన్ సెన్స్, మోడర్న్ గ్లామర్ ..స్లిమ్ లుక్ స్ట్రీమ్ ప్రెజెన్స్‌ను మరోసారి చాటిచెప్పడమే కాకుండా.. సోషల్ మీడియాలో ఈ యంగ్ బ్యూటీకి ఉన్న విపరీతమైన క్రేజ్‌ను ప్రతిబింబిస్తోంది. 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన -అర్జున్ రెడ్డి- చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చుకున్న శాలిని పాండే.. ఆ తర్వాత భిన్నమైన పాత్రలను ఎంచుకుంది. -మహానటి-లో సుశీల పాత్రలో.. కల్యాణ్ రామ్ సరసన 118 అనే హిట్ మూవీలో -మేఘ-గా, అలాగే -ఎన్.టి.ఆర్. కథానాయకుడు-, -ఇద్దరి లోకం ఒకటే-, .. అనుష్క శెట్టి ద్విభాషా చిత్రం -నిశ్శబ్దం-లో కీలక పాత్రల్లో నటించి మెప్పించింది. అనంతరం తమిళంలో 100శాతం కాదల్, గోరిల్లా చిత్రాలతో అడుగుపెట్టి.. రణ్‌వీర్ సింగ్ సరసన -జయేశ్‌భాయ్ జోర్దార్ (2022)- చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇటీవల ఓటీటీ మూవీ -మహారాజ్ (2024)- లో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

ప్రస్తుతం శాలిని పాండే కెరీర్ ఎలా ఉంది? రేసులో వెనకబడిందా?

తొలి సినిమా -అర్జున్ రెడ్డి- సాధించిన భారీ విజయం తర్వాత శాలిని పాండే టాలీవుడ్‌లో హీరోయిన్‌గా వరుస ఆఫర్లు అందుకుంది. కానీ బాలీవుడ్ లో బిజీ అయ్యాక తెలుగులో కొంతవరకు వెనకబడినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్ లో క్రేజీ ప్రాజెక్ట్‌లు చేయలేకపోయినా.. సౌత్ నుండి బాలీవుడ్ వరకు కథాబలం ఉన్న విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన ఉనికిని చాటుకుంటోంది. ప్రస్తుతం సరికొత్త జీరో సైజ్ మేకోవర్‌తో మరింత గ్లామరస్‌గా తయారైన శాలిని పాండే.. మళ్లీ మునుపటి జోరు అందుకుంటుందో లేదో చూడాలి.

వామికా గబ్బి నల్ల చీర ఫోటోలు కాలాతీతమైన సాంప్రదాయ సొబగును ప్రదర్శిస్తున్నాయి



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com